



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 23 | సంచిక : 312 | ది. 11-2-2025 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## ఎమ్మెల్యేల అనర్హత కేసు..
## మరోసారి సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టులో సోమవారం జరిగిన విచారణ వాయిదా పడింది.దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు తో సహా ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లతో కలిపి ఈరోజు కేసు విచారణ జరిగింది. జస్టిస్ బి ఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. రీజనబుల్ టైమ్ అంటే ఏంటి? అని మరోసారి సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పది నెలలు అనేది రీజనబుల్ టైం కాదు అని ధర్మాసనం పేర్కొంది. కేసు విచారణను 18వ తేదీకి వాయిదా వేసింది సుప్రీం కోర్టు.

# రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కనిపించకూడదు..

- దీనికోసం బ్యాంకులు, ప్రభుత్వం కలిసి పనిచేయాలి
- ఎంఎస్ఎంఈలకు రుణాలను కేంద్రం సరళతరం చేసింది...బ్యాంకులు సహకరించాలి
- గత ప్రభుత్వ అక్రమాలపై విచారణల్లో దర్యాప్తు సంస్థలకు బ్యాంకులు సమాచారం ఇవ్వాలి
- పిఎం సూర్యఘర్ పథకం కింద ఏడాదిలో 20 లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం
- ఎస్ఎల్ బిసి సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు





**అమరావతి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రయాణంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లను కోరారు. 10 సూత్రాల అమలుతో విజన్ కలను నిజం చేసేందుకు నిత్యం శ్రమిస్తున్నామని సీఎం అన్నారు. 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నామని...వీటిలో కీలకమైన ప్రాథమిక రంగానికి బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఎక్కువ వృద్ధి సాధించే అవకాశం ఉందని...దీనికి బ్యాంకుల నుంచి తగిన మద్దతు కావాలని సీఎం కోరారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని...దీనికి అనుగుణంగా పంటల సాగు కూడా మారుతోందని అన్నారు. అగ్రికల్చర్ స్థానంలో హార్టికల్చర్ సాగు వస్తుందని...దీన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు హార్టికల్చర్ రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగుచేసే రైతులకు బ్యాంకులు సాయపడాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న రైతులు రుణం కోసం బ్యాంకుకు వచ్చిన 15 నిముషాల్లోనే రుణం ఇచ్చే పరిస్థితి రావాలని సీఎం అభిప్రాయపడ్డారు. అలాగే ప్రతి కుటుంబంలో రెండు మూడు పశువులు లేదా కొన్ని జీవాలు ఉంటే మంచి ఆదాయం వస్తుందని....డైరీ రంగాన్ని ప్రోత్సహించాలని అభిప్రాయమని సీఎం అన్నారు. కొన్ని సందర్భాల్లో సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర రాక పంటలు పారబోసేపరిస్థితి వస్తోందని....దీన్ని నివారించేందుకు ఫుడ్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రొడక్ట్ ఫర్ ఫెక్షన్ పైనా తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని.....పంటలు, ఉత్పత్తులకు విలువ పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.

**ప్రకృతి సేద్యం గేం ఛేంజర్..** బ్యాంకులు అంటే రుణాలు మాత్రమే కాదు....సాగులో కొత్త విధానాలను ప్రోత్సహించేలా పనిచేయాలని సీఎం అన్నారు. పంజాబ్ వంటి రాష్ట్రంలో విపరీతంగా ఫురుగుమందుల వాడకం వల్ల క్యాన్సర్ బాధితులు పెరిగి వైద్యం కోసం ఢిల్లీ బాటపడుతున్నారని అన్నారు. ప్రకృతి సాగుతోనే వీటికి పరిష్కారం చూపగలం హార్టికల్చర్ సాగుతో పాటు ప్రకృతి వ్యవసాయానికి బ్యాంకులు మద్దతుగా నిలవాలి.

**రైతుల ఆత్మహత్యలు కనిపించకూడదు..** రాష్ట్రంలో రైతుల ఆత్మహత్య మాటే వినిపించకూడదని అన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు అవసరమైన మార్గాన్ని అన్వేషిస్తున్నామని తెలిపారు. చనిపోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, బ్యాంకర్లు ఏం చేయాలనే దానిపై ప్రత్యేకం గా మేథో మథనం చేయాల్సి న అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇకపోతే ఎంఎస్ఎంఈలకు రుణాలను కేంద్రం సరళతరం చేసిందని, బ్యాంకులు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని సీఎం అన్నారు. ఎంఎస్ఎంఈ లకు తగినప్రోత్సాహం ఇవ్వాలని, ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నామని అన్నారు. అది సాకారం కావాలంటూ చిరు వ్యాపారులకు రుణాలు సులభతరం కావాలి అని సీఎం అన్నారు.

**దర్యాప్తు సంస్థలకు సహకరించండి..** గత ప్రభుత్వ విధ్వంస పాలనలో అన్ని విభాగాలు, రంగాలు దెబ్బతిన్నాయని...వాటిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నామని...దీనికి బ్యాంకుల సహకారం ఎంతో కీలకం అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా శాఖల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేస్తోందని...ఈ విచారణకు బ్యాంకు నుంచి కొంత సమాచారం కూడా అవసరం అవుతుందన్నారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణలో బ్యాంకులు దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇచ్చి సహకరించాలని సీఎం సూచించారు.

**ఏడాదిలో 20 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్..** కేంద్ర పథకాలను అందిపుచ్చుకుని ప్రజలకు మేలు చేయాలనే సంకల్పానికి బ్యాంకుల మద్దతు ఉండాలని సీఎం అన్నారు. పిఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20 లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందించాలని లక్ష్యం విధించుకున్నామన్నారు. '2 కిలో వాట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ పరికరాలు అందిస్తాం. ఈ కార్యక్రమం అమలు ద్వారా అనూహ్య ఫలితాలు వస్తాయి. ప్రజలకు ఉపయోగపడే ఈ పథకం అమల్లో బ్యాంకులు కూడా భాగస్వామ్యం అవ్వాలి. ఈ పథకం ద్వారా ఉచితంగా తమ అవసరాలకు విద్యుత్ పొందడమే కాకుండా...తమ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో ప్రజలు ఆదాయం పొందే అవకాశం ఉంది' అని సీఎం అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయని...వాటికి బ్యాంకులు రుణాలు ఇచ్చి సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ సీఈఓ మనిమేఖలై, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# డేటా అనుసంధానం వేగవంతం చేయాలి

- శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు విస్తృతంగా ఉపయోగించండి
- వాట్సాప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు పరిశీలించండి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు




**అమరావతి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ప్రభుత్వ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..అన్ని శాఖల మధ్య ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసే పనుల్లో మరింత వేగం పెరగాలని సూచించారు. డేటా మొత్తం ఒక చోటుకు చేర్చి డేటాలేక్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, మెరుగ్గా అందించేందుకు వీలుంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్ టెక్నాలజీ లాంటి సాంకేతికతలను ఉపయోగించుకుని డేటాను విశ్లేషించుకుని ఆయా శాఖల పనితీరు మెరుగుపరచడానికి దోహదపడేలా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారం అందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సులభంగా సేవలు అందించగలమని, ప్రస్తుతం అందిస్తున్న సేవలతో పాటు అదనంగా ఏం అందించగలమో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించేవారికి సాంకేతిక అవరోధాలు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృతంగా సీసీ కెమెరాలు..** రాష్ట్రంలో ఇప్పటివరకు 14,770 సీసీ కెమెరాలను వినియోగంలో ఉన్నాయని, శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరస్థులను పట్టుకోవడంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర సాంకేతికను ఉపయోగించుకోవాలన్నారు. నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలక పాత్రపోషిస్తాయన్నారు. నేరం జరిగిన వెంటనే సమీప పోలీసు స్టేషన్ ఉన్నతాధికారికి అలర్ట్ మెసేజ్ వెళ్లి, నేరస్థులు పారిపోకుండా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు సహాయపడేలా రూపకల్పన చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపైన కూడా ముందుగానే నిఘా పెట్టి, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్ సీఈఓ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ఏ ఏ దశల్లో ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతంగా వినియోగించుకోవడానికి గూగుల్ సంస్థ సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్త, సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాంశు శుక్లా, జీఎస్ డబ్ల్యు డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



**అమరావతి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** శ్రీకాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో సీఎంను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.బాపిరెడ్డి, ప్రధాన అర్చకులు అందించారు. ఈనెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా రావాలని సీఎంను కోరారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సీఎం చంద్రబాబుకు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఉత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు.

## అమెరికాలో చేనేత ఎక్స్ పోలు

- మంత్రి సవితతో చికాగో ప్రతినిధులు

**అమరావతి ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను అమెరికాలోని చికాగో రాష్ట్ర ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ లో చికాగో లో పురుద్యూ యూనివర్సిటీ, జీఎస్ఏ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జీఎస్ఏ గ్లోబల్ మిల్లెట్స్ ఎక్స్ పో లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి సవితకు చికాగో ప్రభుత్వ ప్రతినిధి లా షాన్ కె.ఫోర్డ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితతో చికాగో రాష్ట్ర ప్రతినిధులు చర్చించారు. అమెరికాలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంపై తమవంతు సాయమందిస్తామన్నారు. ఇందుకోసం పలు రాష్ట్రాల్లో చేనేత ఎక్స్ పోలు నిర్వహిస్తామన్నారు. పురుద్యూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల డిజైన్ల తయారీపై ఆంధ్రప్రదేశ్ చేనేతలకు శిక్షణ కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, అమెరికాలో చేనేత ఎక్స్ పోల నిర్వహణపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతామన్నారు. నేతన్నలకు నూతన డిజైనింగ్ శిక్షణివ్వడానికి ముందుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## కోర్టుకు అబద్ధపు సాక్ష్యం చెప్పిన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

- అక్రమ భవనాన్ని కూల్చివేయండి.
- జోనల్ కమిషనర్ తో యుగంధర్ రెడ్డి తీవ్ర వాగ్వివాదం.



**కూకట్‌పల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** బాలానగర్ కార్పొరేటర్ అవుల రవీందర్ రెడ్డి గ్రౌండ్ ప్లస్ 2 అనుమతులు తీసుకుని, అక్రమంగా అదనంగా మరో మూడు అంతస్తులు అక్రమంగా నిర్మించి కోర్టుకు అబద్ధం చెప్పాడని, తక్షణమే చర్యలు తీసుకొని అక్రమ భవనాన్ని కూల్చివేయండి అంటూ అధికారులను కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను లిఖిత పూర్వకంగా కోరారు. కేవలం రెండు అంతస్తులు కట్టుకుంటే కూకట్ పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వేధిస్తున్నారని కింది కోర్టుకు అబద్ధాలు చెప్పిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు.బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, కాంగ్రెస్ నేతలతో జోనల్ కమిషనర్ ను కలిశారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నా కూకట్పల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, రాజ్యాంగం అందరికీ ఒక్కటేనని, కార్పొరేటర్ కు వేరే రాజ్యాంగం ఏదైనా ఉందా అని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 420 అని సంబోధించినా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, కార్పొరేటర్ అవుల రవీందర్ రెడ్డిని ఉపేక్షించే పరిస్థితి లేదని, ఆవుల రవీందర్ రెడ్డికి కూకట్ పల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు సహకరిస్తున్నారని యుగంధర్ రెడ్డి తీవ్రంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మధు గౌడ్, ఆకుల నరేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైన్స్ వద్ద మద్యం తాగుతూ వ్యక్తి మృతి

- వైన్స్ ను బారుగా మార్చి దోచుకుంటున్న వైన్స్ యాజమాన్యం
- బరితెగించిన కాచవరం శ్రీ జిష్ణు వైన్స్
- మామూళ్ల మత్తుతో కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు






**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** వైన్స్ షాపు వద్ద మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కాచవరం (దాములూరు రోడ్డు)లోని శ్రీ జిష్ణు వైన్స్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం మండల పరిధిలోని దాములూరుకు చెందిన షేక్ మస్తాన్ (65) శ్రీ జిష్ణు వైన్స్ లో ఓఏబీ మద్యం కొనుగోలు చేసి అక్కడే సేవిస్తూ అకస్మాత్తుగా మృతి చెందాడు. వైన్స్ షాపు వద్ద మద్యం తాగుతూ మృతి చెందడంతో కల్తీ మద్యం తాగి మృతి చెందాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే విషయం తెలుసుకున్న అధికార పార్టీకి చెందిన వైన్స్ షాపు యజమానులు మృతుడి బంధువులతో పంచాయితీ చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని దాములూరు తరలించారు. వైన్స్ షాపులను బార్లుగా మార్చి రాత్రి, పగలు తేడా లేకుండా తాగేందుకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న వైన్స్ షాపుల యజమానులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైన్స్ షాపు నిర్వాకంతో.. రోజువారీ కూలి చేసుకుని జీవనం సాగిస్తున్న మస్తాన్ కుటుంబం రోడ్డున పడింది. ఎక్సైజ్ అధికారులు ప్రతి నెలా వైన్స్ షాపులు, బార్ల యజమానుల నుంచి ఎక్సైజ్ అధికారులు భారీగా ముడుపులు పుచ్చుకొని అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్లే వైన్స్ షాపుల యజమానులు బార్లుగా మార్చి సకల సౌకర్యాలతో మందుబాబులతో తాగిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా మస్తాన్ మృతికి కారణాలపై ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గోదావరి - కృష్ణా - పెన్నా నదుల అనుసంధాన పథకం ఒక గేమ్ఛేంజర్ ప్రాజెక్టు

- సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు



**విజయవాడ, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధాన పథకం అన్నదాతల జీవన ప్రమాణాలు పెరిగి వారికి ఆర్థిక భరోసా కల్పించే గేమ్ ఛేంజర్ ప్రాజెక్టు అని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. విజయవాడ గాంధీనగర్ లోని ఐలాపురం హొటల్లో కిసాన్ సేవా ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ బాధ్యులు అక్కినేని భవానీ ప్రసాద్ అధ్యక్షతన గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొన్న ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ మరియు పశ్చిమ ప్రకాశం, నెల్లూరు జిల్లాల ప్రాంతాలు తరచూ కరువు కాటకాలకు గురవుతు న్నారని, ఈ గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టు అమలుతో రాష్ట్ర నీటి పారుదల ముఖచిత్రం మారబోతోందని, దీనివలన 7.5 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు వస్తుందని, వెలుగొండ, నాగార్జునసాగర్ కుడికాలువ, కండలేరు, సోమశిల ప్రాజెక్టుల క్రింద ప్రస్తుతం వున్న 22.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ జరుగుతుందని, 80 లక్షల జనాభాకు త్రాగునీరు, 20టి.ఎం.సి.లు పారిశ్రామిక అవసరాలకు నీరు అందుతుందని వివరించారు. అట్లాగే ఈ ప్రాజెక్టు మొదటి దశలో గుంటూరు జిల్లా హరిశ్చంద్రాపురం దగ్గర 10 టి.ఎం.సి.లతో వైకుంఠపురం బ్యారేజి అక్కడినుండి పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ కుడికాలువ దగ్గర 80వ కి.మీ. నకిరేకల్ దగ్గర ఎత్తిపోతల ద్వారా అనుసంధానం చేయటం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా మెట్ట ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, దీనిని రైతులందరు స్వాగతించాల్సిన అవసరం వుందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే 2014-2019 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం, 2019-2024 లో గత వై.సి.పి. ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖతో జరిపిన ప్రత్యుత్తరాలను పరిగణనలోనికి తీసుకుని కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కె.ఆర్.ఎం.బి.) ప్రధాన కార్యాలయాన్ని రైల్, రోడ్డు, విమాన కనెక్టివిటీ వుండి కృష్ణానది నడిబొడ్డున వున్న విజయవాడలోనే ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే శ్రీశైలం ఎగువ భాగాన పైన వున్న తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014కు వ్యతిరేకంగా సి.డబ్ల్యు.సి., ఎపెక్స్ కౌన్సిల్ నుంచి ఏ విధమైన అనుమతులు తీసుకోకుండా 105 టి.ఎం.సి.లతో ప్రాజెక్టుల విస్తరణ, 150 టి.ఎం.సి.లతో కొత్త ప్రాజెక్టులు చేపడుతుందని, ఇవి పూర్తయితే శ్రీశైలం దిగువ భాగాన నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల క్రింద వున్న 15 లక్షల ఎకరాలు, ప్రకాశం బ్యారేజి క్రింద వున్న 13 లక్షల ఎకరాలు, ఎస్.ఆర్.బి.సి. క్రింద వున్న 2 లక్షల ఎకరాలు మొత్తం 30 లక్షల ఎకరాలకు చుక్కనీరు రాదని ఆందోళన వ్యక్తం చేస్తూ దీనిని అందరూ కలిసికట్టుగా నిరోధించాలని సమావేశంలో కోరారు.

## విద్యావంతుల ఎన్నికల్లో లక్ష్మణరావుని గెలిపించుకుందాం - జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి




**గుంటూరు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఫిబ్రవరి 27వ తేదీన జరుగునున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ తరఫున పోటీ చేస్తున్న విద్యావేత్త కె ఎస్ లక్ష్మణరావుని గెలిపించుకుందామని పట్టభద్రులకు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కె ఎస్ లక్ష్మణరావు నామినేషన్ కార్యక్రమంలో వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.విభజన హామీల అమలు కోసం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, సామాజిక న్యాయం కోసం, ఉపాధ్యాయుల హక్కుల సాధనకై, నిరుద్యోగుల అభ్యున్నతికై నిరంతరం కృషి చేస్తున్న కె ఎస్ లక్ష్మణరావుని గెలిపించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రచయితగా, మేధావిగా, వక్తగా, విశ్లేషకుడిగా ప్రజల బాగోగులకై నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు మన కె ఎస్ లక్ష్మణరావు అని పేర్కొన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీగా, ఫ్లోర్ లీడర్ గా నమ్మిన సిద్ధాంతాలకై నిజాయితీగా, నిబద్ధతతో నిరంతరం పనిచేస్తున్న కె ఎస్ లక్ష్మణరావు గెలుపు మనందరి గెలుపుగా భావించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, కాంట్రాక్ట్ & ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక, కర్షక, మహిళా, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావుకి కుల, మత, ధన రాజకీయాలకతీతంగా ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని, ప్రజల వాణిని, గొంతుకను శాసనమండలిలో ప్రతిధ్వనించేలా కృషి చేయాలని కోరారు.

## విద్యుత్ ప్రమాద బాధితురాలు లాస్యను పరామర్శించిన మీరాకుమార్ దంపతులు



**కాకినాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** ఇటీవల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన చిన్నారి కేతా లాస్య(5) ఇంటి మీద ఆడుకుంటున్న సమయంలో విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలవడం అందరికీ విధితమే.చిన్నారి లాస్య విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయాలైన విషయం తెలవడంతో హైదరాబాద్ జిఎంకె చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్, దుర్గలక్ష్మి దంపతులు మరియు ట్రస్ట్ సభ్యులు స్పందించి తక్షణ సహాయం కింద ఆ సమయంలో ఐదు వేల రూపాయలు సహాయం చేసి మరింత ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నారి లాస్యకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి చికిత్స అందించే క్రమంలో తీవ్ర గాయాలు అవ్వడం వల్ల ఇన్ఫెక్షన్ రావడంతో చేతిని తొలగించవలసి వచ్చింది.దీంతో కుటుంబీకులు తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్ యాభై వేల రూపాయలు, అలాగే ట్రస్ట్ తరఫున జరిగిన విషయం సోషల్ మీడియాలలో తెలపగా సంఘీయుల వద్ద నుండి జిఎంకె ట్రస్టు ద్వారా కార్యదర్శి పిల్లి నాగబాబు సేకరించిన యాభై వేల రూపాయలను కాకినాడ పరిసర ప్రాంతాల్లోనీ శెట్టిబలిజ కుటుంబ సభ్యుల అందుబాటులో ఉన్న అందరు సమక్షంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న చికిత్స వివరాలను తెలుసుకొని చిన్నారి కేతా లాస్య పేరు మీద లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలని చిన్నారి లాస్య కుటుంబ సభ్యులకు అధ్యక్షులు గుత్తుల మీరాకుమార్ దంపతులు అందించడం జరిగింది.

## ఆరోగ్యమే మహాభాగ్యం - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో చంద్రుపట్ల ఎంపీ యూపీ స్కూల్ నందు విద్యార్థులకు అందించే ఆల్బెండజోల్ మందులు పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది ఒక శక్తివంతమైన యాంటీబయాటిక్ ఔషధం అని వివిధ రకాల చికిత్సలలో దాని ప్రభావం కోసం దృష్టిని ఆకర్షించిందని పురుగుల బెడద నివారించేందుకు ఇది బహు ముఖ్య ఔషధం అని పేగు మరియు కణజాల పరాన్నజీవులను ప్రభావితం చేస్తుందని ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ ఔషధాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆరోగ్యమే ప్రధానమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## మండుటెండలో విద్యార్థినిలు గేటు బయట పడిగాపులు

- పాఠశాల గేటు కు తాళం వేసిన ఇన్ ఛార్జ్ హెచ్ ఎం



**గన్నవరం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** గన్నవరం ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణ లో ఉన్న ప్రభుత్వ కళాశాల లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినిలు ప్రాక్టికల్స్ పరీక్షలకు వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చేసరికి పాఠశాల ప్రధాన గేటు కు తాళం వేసి ఉండడం తో మండుటెండలో గేటు బయట 30 నిమిషాల వరకు విద్యార్థులు పడిగాపులు పడ్డారు. కనీసం సమాచారం లేకుండా పరీక్షల సమయం లో ఇన్ ఛార్జ్ హెచ్ ఎం జి వి రవి బాబు గేటు కు తాళం వేయడం పై కళాశాల విద్యార్థినిల తల్లిదండ్రులు తీవ్రంగా ఖండించారు. గేటు తాళం తీయమని అడగగా వాస్తు రీత్యా ఉత్తరం దిక్కు న ఉన్న గేటు నుండి రాకపోకలు సాగించాలని హుంకుమ్ జారి చేసిన ఇన్ ఛార్జ్ హెచ్ ఎం.. విద్యార్థుల ఇబ్బందిని గమనించిన కళాశాల ఉపాధ్యాయులు హెచ్ ఎం దగ్గర నుండి గేటు తాళాలు తీసుకొని గేటు ను తెరవడం జరిగిందని విద్యార్థినిలు తెలిపారు. పరీక్షల సమయం లో గేటుకు తాళం వేయడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థినిలు తెలిపారు. ఈ విషయం పై వివరణ కోరగా దురుసుగా సమాధానం చెబుతున్న ఇన్ ఛార్జ్ హెచ్ ఎం జి వి రవి బాబు.

## దివంగత బొజ్జ వీర రాఘవయ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ..



**వీరులపాడు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెద్దాపురం గ్రామంలో సోమవారం నాడు దివంగత బొజ్జ వీర రాఘవయ్య పెద్దకర్మ కార్యక్రమము జరిగింది. కుటుంబ సభ్యులు మరియు కూటమి నేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరైనారు. ఏం.ఎల్. ఏ. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఘనంగా విజయ పాల ఉత్పత్తిదారుల వజ్రోత్సవ వేడుకలు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం వజ్రోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా పాలకవర్గ సభ్యురాలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుదీర్ఘకాలంగా అత్యధిక లీటర్ల పాలన సరఫరా చేసిన పాల రైతులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు క్లస్టర్ మేనేజర్ ఈ సాంబశివమూర్తి హాజరయ్యారు. 20 23- 20 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంఘం లాభాలలో 47 వేల రెండు వందల రూపాయలు ప్రోత్సాహక బహుమతులను అందించడం జరిగింది అని చెప్పారు. బాల రైతుల కుటుంబమును కన్నతండ్రిలా కంటికి రెప్పలా చూస్తున్నా. చైర్మన్ చల సాని ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రక్తదాతలను ప్రోత్సహిద్దాం..

- మరొకరి ప్రాణాలు కాపాడుదాం
- కేసిబిఎస్ అధ్యక్షుడు కోసూరి పిలుపు



**కాకినాడ,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** రక్తదాతలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ది. కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కేసిబిఎస్)అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. కేసిబిఎస్ మాజీ అధ్యక్షులు దివంగత కోసూరి యదుసూర్య జయంతి సందర్భంగా సూర్యారావుపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత కే సి బి ఎస్ వ్యవస్థాపకులు కోసూరి కృష్ణారావు,కోసూరి ఎదుసూర్య విగ్రహాలకు పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటైన ఈ రక్తదాన శిబిరంలో సంస్థ ఉద్యోగులు, సభ్యులు, ఖాతాదారులు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఒకరు చేసే రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న మరొకరికి ప్రాణదానం వంటిదన్నారు. కేసిబిఎస్ ఉపాధ్యక్షులు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంస్థ రోజువారీ కార్యకలాపాలతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందన్నారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కే సి బి ఎస్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.మేనేజర్ చీమల కొండ గంగాధరం రక్తదాన శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. రక్తదానం చేసిన వారందరినీ సంస్థ పాలకవర్గ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివ ,బాలయోగి, కేసిబిఎస్ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## యాదవుల రాజ్యాధికారమే యాదవ విద్యావంతుల వేదిక లక్ష్యం

- యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలకాని వెంకట్ యాదవ్





**నారాయణపేట,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** యాదవులకు రాజ్యాధికారం రావడమే లక్ష్యంగా యాదవ విద్యావంతుల వెనుక పనిచేస్తుందని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట యాదవ్ పేర్కొన్నారు. స్థానిక సిటిజన్ క్లబ్ లో జరిగిన యాదవ విద్యావంతుల వేదిక అవగాహన తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన అయిన మాట్లాడుతూ యాదవుల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక వాటా కోసం ఉద్యమించాలనే లక్ష్యంతో మన జాతికి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమానత్వం సాధించే బాధ్యతతో "యాదవ విద్యావంతుల వేదిక" పని చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి చైతన్య సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాదవ విద్యావంతులను, మేధావులను యాదవ సమాజానికి చేరువచేసి యాదవ జాతిని జాగృతం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు చెలకని తెలిపారు. జనాభా దామాషా పద్ధతిన రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో మా వాటా మాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా దామాషా పద్ధతి ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని, అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. బాలు యాదవ్ బైకాని, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి వై రవికుమార్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ అవగాహన తరగతుల కార్యక్రమంలో యాదవ విద్యావంతుల వేదిక నారాయణపేట్ జిల్లా కమిటీని నియమించడం జరిగింది. అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో తీర్మానాలను సమావేశం ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన నివేదిక లెక్కల ప్రకారం రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం యాదవులకు అత్యధిక సీట్లు కేటాయించాలని, బి.పి. మండల్ సిఫార్సులను అమలు చేయాలని,కేంద్ర ప్రభుత్వం జన గణనలో కుల గణనను వెంటనే చేపట్టాలని, ఈడబ్ల్యూఎస్ పేరుతో తీసుకొచ్చిన అగ్రకుల రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని, రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, బడ్జెట్లో యాదవులకు 18% నిధులు కేటాయించాలని, గొల్ల, కురుమల ఎస్.ఎన్.టి రిజర్వేషన్లు పునరుద్ధరించాలని, గొర్లకాసుకునే యాదవులపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్ని ఎత్తి వేయాలని, విదేశీ చదువులకు తగినంత ఓవర్సీస్ స్కాలర్ షిప్ ఇవ్వాలనే డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతూ సమావేశం తీర్మానించింది. యాదవ విద్యావంతుల వేదిక నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కార్యక్రమానికి హాజరైనటువంటి యాదవ బంధువులకు ధన్యవాదాలు తెలియజేస్తూ యాదవ విద్యావంతులు వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చలకాని వెంకట్ ఆదేశానానుసారం నారాయణపేట జిల్లా శాఖ పనిచేస్తుందని తెలియజేయుటకు సంతోషిస్తునమని, చలకాని వెంకట్ తన 40 ఏళ్ల అనుభవంతో తన ఆలోచన విధానాలకు అనుకూలంగా యాదవ సంఘాలన్నీ ఏకతాటిపైకి తెచ్చి అభివృద్ధి చేయాలన్న సంకల్పం నెరవేరాలని అందుకు నారాయణపేట జిల్లా శాఖ "చలకాని అన్న" వెన్నంటే ఉంటుందని నూతనంగా ఎన్నికైన యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ రఘువీర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగులు యాదవ్, ప్రధాన కార్యదర్శి లాలూ యాదవ్ లు తెలిపారు.

## శివారు భూములకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి: కలెక్టర్ మహేష్ కుమార్




**అమలాపురం,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా కాలువలు, డ్రైన్ల పై అవసరమైన చోట్ల క్రాస్ బండ్లు ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అమలాపురం కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో కలిసి ..తహశీల్దారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, వివిధ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ రబీ సీజన్లో జిల్లాలో శివారు భూములకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల కాలువలు, డ్రెయిన్ల పై క్రాస్ బండ్లు ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఫిబ్రవరి 14 లోపు నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని.. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరించే అంశంపై నాలుగు పారామీటర్ల ఆధారంగా జిల్లాలకు ప్రతినెలా ర్యాంకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఎన్ని ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు..., స్వీకరించిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించడం, నాణ్యతతో పరిష్కరించడం,ప్రజా ప్రతినిధులు ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తున్నారు అనే అంశాలను పరిగణలోకి తీసుకొని పనితీరు ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, విఐపి ల నుంచి వచ్చే ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రెండు వారాల లోపు ప్రతి ఒక్క శాఖ పని తీరు మెరుగుపరచుకోవాలన్నారు. రీ సర్వే పూర్తయి న గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 17 గ్రామాలలో నిర్వహిస్తున్న రీ సర్వేను ఫిబ్రవరి 20 లోపు పూర్తి చేయాలన్నారు. గతంలో సరిహద్దు రాళ్లపై ముద్రించిన చిత్రాలను చెరిపి వేసే ప్రక్రియకు నిధులు కేటాయించడం జరిగిందని సంబంధిత ప్రక్రియను ఈనెల 20 లోపు పూర్తిచేయాలని తహశీల్దార్లు సర్వే అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 22 మండలాలలో ఆక్వా, ఆక్వాయేతర జోన్లలో ఉన్న చెరువులను రెవెన్యూ, మత్స్యశాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్వా జోన్ మ్యాపులను ఈ నెల 20 లోపు తయారు చేయాలని కలెక్టరు ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 నిర్మాణంలో భాగంగా మండల,జిల్లా స్థాయి విజన్, కార్యచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందని,నూతనంగా నియోజకవర్గ స్థాయి విజన్ ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నియోజకవర్గ ప్రత్యేక అధికారి,ఐదు మంది సచివాలయ సిబ్బంది, ఒక ప్రత్యేక నిపుణులు కలిసి ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకొని 2047 విజన్ ప్లాన్ లోని పది సూత్రాలు ప్రతిబింబించేలా జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక విజన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు. జిల్లాలో ఎం ఎస్ ఎం ఈ సర్వేను ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా జిల్లాలో ఎవరైనా మనుషులతో ఇసుకను తవ్వి తీసుకుపోవచ్చని.. ఇసుకను తరలించేటప్పుడు సంబంధిత సచివాలయంలో కూపన్లు రైజ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మట్టి తవ్వకాలకు ఎటువంటి తాత్కాలిక అనుమతులు ఇవ్వలేదని.. అక్రమంగా మట్టి తరలించకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అయినవిల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ ఉప కేంద్రానికి సంబంధించి రావులపాలెం,కొత్తపేట, అంబాజీపేట, అయినవిల్లి మండలాలలో ఏర్పాటు చేయాల్సిన 64 విద్యుత్ టవర్లను నిర్మించడానికి రైతులను ఒప్పించే దిశగా సంబంధిత తహసీల్దారులు కృషి చేయాలి అన్నారు. అమలాపురంలో నూతనంగా వినియోగంలోకి తీసుకువచ్చిన రైతు బజారులో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సంబంధిత అధికారులను అడిగి కలెక్టరు తెలుసుకున్నారు. రైతు బజార్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు టి. నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, అమలాపురం కొత్తపేట రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అధికారులు కె. మాధవి,పి శ్రీకర్,డి అఖిల,పిడి డిఆర్డిఏ డాక్టర్ శివ శంకర ప్రసాద్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "నాన్న - నేను" వెబ్ సిరీస్‌కు ఘన ఆరంభం....





**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్యస్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో, "నాన్న - నేను" వెబ్ సిరీస్ షూటింగ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం హాజరై క్లాప్ కొట్టి తొలి షాట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ, "నాన్న ప్రేమ, త్యాగం, గొప్పతనాన్ని ప్రతిబింబించే ఈ వెబ్ సిరీస్, సమాజానికి మంచి సందేశం అందించనుంది. ఇలాంటి ఉత్తమ కథాంశాలను ప్రోత్సహించడం ఎంతో అవసరం అని పేర్కొన్నారు. దీనిలో తండ్రి పాత్రలో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ మాజీ చైర్మన్, అధ్యాత్మిక వేత్త వాసిరెడ్డి బెనర్జీ నటించడం ఏంతో సంతోషంగా ఉందని,పవిత్రమైన తిరుపతమ్మ ఆలయంలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడం విశేషమని, ఈ వెబ్ సిరీస్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, చిత్రబృంద సభ్యులు హాజరై తమ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాన మాజీ చైర్మన్ లు నూతలపాటి చెన్నకేశవరావు, కాకాని శ్రీనివాసరావు లతో పాటు వేగినటి గోపాలకృష్ణమూర్తి (మాజీ ఎంపీపీ), కాకాని కోటేశ్వరరావు, దివ్వెల మల్లేశ్వరరావు, నల్లూరి అప్పారావు, బరిగల వెంకయ్య పాల్గొన్నారు. చిత్ర నిర్మాణ బృందం ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని తెలిపింది. నటులు, దర్శకుడు, నిర్మాత, రచయితలు కలిసి, మాతృభక్తి, కుటుంబ విలువలు, తల్లితో అనుబంధం వంటి హృదయాన్ని హత్తుకునే అంశాలను ఇందులో చూపించనున్నట్లు వివరించారు. సాంకేతికంగా కూడా ఈ వెబ్ సిరీస్ అత్యున్నత ప్రమాణాలతో రూపొందనుందని, ప్రేక్షకులకు భావోద్వేగ పరంగా గాఢమైన అనుభూతిని అందించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

## ఆకులమన్నాడు లో ముమ్మరంగా ఉపాధి హామీ పథకం పనులు





**పెడన, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం లోని గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సర్పంచి ఎండి రఫీ ఆధ్వర్యంలో గ్రామంలోని పంట బోదెలు స్మశాన వాటికలు డొంకలను ఉపాధి హామీ పథకం కింద పనులను నిర్వహిస్తున్నారు. గత 20 రోజులుగా ఈ పనులు సాగుతున్నాయి. మొత్తం వంద రోజులు ఈ పనులు నిర్వహించనున్నట్లు సర్పంచి రఫీ తెలిపారు. చేపట్టిన పనులు ఫలితాన్ని సూపిస్తున్నాయి. గతంలో లక్షల రూపాయలు ఖర్చు చూస్తేనే గాని మంచిది చెరువులకు తాగునీరు వెళ్ళేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర పంట బోదులను బాగుచేయడంతో చెరువులకు నీటి సరఫరాలకు జరుగుతుంది. అలాగే పంచాయతీ పరిధిలోని డొంకలను కూడా ఈ పనుల ద్వారా బాగు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ భాను ఈ పనులను పర్యవేక్షిస్తున్నాడు. మూడు వారాలపాటు పనులు జరగగా దాదాపు 1800 మంది ఈ పథకం పాలుపంచుకున్నారు. పనుల నిర్వహణ పట్ల సర్పంచ్ రఫీ వ్యక్తం చేశారు.

## శ్రీ తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ళ కు పటిష్ఠ ఏర్పాట్లు..

- ఏర్పాట్లు పరిశీలించి దేవస్థాన అధికారులకు పలు సూచనలు తెలిపిన ఆర్ .డీ ఓ.బాలకృష్ణ



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ గోపయ్యస్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి పెద్ద తిరునాళ్ళ మహోత్సవం 11 వ తేదీ మంగళవారం నుండి 15 వ తేదీ శనివారం వరకు జరగనుంది, ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక పై 11 తేదీ రాత్రి 9-32 నిముషాల కు తిరుపతమ్మ అమ్మ వారి కీ గోపయ్యస్వామి వారికి కళ్యాణ వేడుక నిర్వహించనున్నారు, కావున నందిగామ డివిజన్ ఆర్. డీ. ఓ. బాలకృష్ణ సోమవారం ఏర్పాట్ల ను పరిశీలించి తిరుణాళ్లకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండాతగ్గ జాగ్రత్త లు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వాహణాధికారి భూపతి రాజు సత్య నాగ కిశోర్ కుమార్, కు చైర్మన్ జంగాల, శ్రీనివాసరరావు, కు ఈ ఈ రమాకు పలు సూచనలు తెలిపారు, తిరుణాళ్లకు తెలుగు రాష్ట్ర ల నుండి భారీగా భక్తులు తరలి రానుండటం తో జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర్ బాబు ఆదేశాల తో ఎక్కడ ఎటువంటి అవాంచనియా సంఘటనలు జరుగ కుండా సంబంధి త శాఖల ను సమన్వయం చేసుకుంటూ నలుగురు ఏసీపీలు, 13 మంది సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, 30 మంది ఎస్ ఐ తో మొత్తం 500 మందిసిబ్బంది తో నందిగామ డివిజన్, ఏ సీ పి. తిలక్ ఆదేశాలతో జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వర రావు పర్యవేక్షణ లో స్థానిక ఎస్ ఐ. అర్జున్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్త్ ఏర్పాట్లు చేశామని సీ ఐ. వెంకటేశ్వరరావు ఆర్ డీ ఓ. బాలకృష్ణ కు తెలిపారు. కళ్యాణం అయిపోయే వరకు సిసి కెమెరా లు వుండే గద్ది వద్ద ఉండి ఎక్కడ ఎపుడు ఏమి జరుగుతుంది అని పరిశీలించనున్నట్లు ఆర్ డీ ఓ బాలకృష్ణ అధికారులకు తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శాంతి లక్ష్మి, ఎం పి డీ ఓ. జి. శ్రీను, ఆలయ ఈ ఈ రమా, ఏ ఇ ఓ లు ఉమా పతి, తిరుమలేశ్వర రావు,ఏ ఇ లు రాజు, అరవింద్,సూపర్ డెంట్, శ్రీనివాస్, బత్తుల కృష్ణ,మరియు సిబ్బంది, పాల్గొన్నారు.

## నేడు తిరుపతమ్మ కళ్యాణం..

- విద్యుత్ అలంకరణతో ఆలయం..



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ గోపయ్యస్వామి కళ్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి జరగనుంది. ఈ కార్యక్రమానికి దేవస్థానం వారు నూతన కాంతుల తో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు,కళ్యాణాన్ని నిర్వహించేందుకు భారీ వేదిక, ఎక్కువ మంది వీక్షించేందుకు గ్రామం లోని పలు సెంటర్లలో డిజిటల్ స్క్రీన్ ల ను ఏర్పాటు చేశారు, దీక్ష స్వాములు తిరుముడులు సమర్పించేందుకు శ్రీ స్వయంభు శంబు లింగేశ్వరస్వామి శివాలయం లో అలాగే నరసింహస్వామి, వేణు గోపాలస్వామి, సీతారామాలయం లలో, పలు ఆలయాల్లో షామియానాలు ఏర్పాటు చేసి స్వాములు విశ్రాంతి తీసుకొనేందుకు ఏర్పాట్లు చేశారు.మున్నేటి అవతల వున్న శ్రీ తిరుపతమ్మ ఆడి టోరియం లో సుమారు 40 వేల మందికి భోజనాలు సిద్ధం చేస్తున్నారు, జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ ప్యాకెట్లలను భక్తులకు అందుబాటులో ఉంచటం జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి కిశోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగేందుకు తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చే భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు, నందిగామ డివిజన్ ఏసీపీ తిలక్ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

## నూతనంగా ఎన్నికైన వారిని సత్కరిస్తున్న బస్తీ ప్రజలు..



**జగద్గిరిగుట్ట ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బి బ్లాక్ బస్తీ కమిటీ ఎన్నికలు శనివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో స్కూటర్ గుర్తుపై పోటీ చేసిన ప్యానెల్ గెలుపొందింది. బస్తీలో మొత్తం 464 ఓట్లు ఉండగా అందులో 399 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షులుగా పోటీ చేసిన బసవప్పకు 184, పిల్లి ఆంజనేయులుకు 114, జమేదార్ సంతోష్‌కు 79 ఓట్లు వచ్చాయి. బసవప్ప 70 ఓట్లతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన బండారి రవిందర్‌రెడ్డికి 251 ఓట్లు పోలవగా బిఎస్ఆర్ నానికి 107 ఓట్లు వచ్చాయి, రవిందర్‌రెడ్డి 144 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అదే విధంగా కోశాధికారిగా పోటీ చేసిన భానుచందర్‌కు 144 ఓట్లు రాగా శ్రీకాంత్ యాదవ్‌కు 209 ఓట్లు పోలయ్యాయి. శ్రీకాంత్ యాదవ్ 65 ఓట్లతో గెలుపొందారు. అనంతరం బస్తీ పెద్దలు, ప్రజలు నూతనంగా గెలిచిన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బసవప్ప, రవిందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి లు మాట్లాడుతూ బస్తీ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని, తమ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైటింగ్ ప్యాడ్ పంపిణీ





**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, పదవ తరగతి చదువుతున్న గవర్నమెంట్ స్కూల్ అయినా సర్వారం గిరిజన ఆశ్రమ పాఠశాల, రుద్రంపూర్, పెనగడప, హేమచంద్రపురం జెడ్పి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కొల్లి కల్పనా చౌదరి రైటింగ్ ప్యాడ్స్ ను పంపిణీ చేశారు. పిల్లలు ఎంతవరకు పరీక్షలకు సంసిద్ధమయ్యారని అడిగి తెలుసుకున్న ఆమె వారికి కొన్ని సలహాలు సూచనలు తెలియజేసి భవిష్యత్తులో పై చదువుల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల ద్వారా ఉత్తీర్ణత శాతం అంచనాలను స్వయంగా అడిగి తెలుసుకుని పరీక్షల తేదీ దగ్గర పడుతుండడంతో ఉపాధ్యాయులు వారి మీద ఎక్కువ దృష్టి పెట్టి భయాందోళన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కొల్లి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రూప్లా నాయక్, వాలంటీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్.



**పేట్ బషీరాబాద్ ఫిబ్రవరి 10 (వార్తాప్రభ) :** కోంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఛాంద్ర విలాస్, సిల్వర్ లీఫ్, అపర్ణా పాల్మ్ గ్రోవ్స్, రాయల్ పార్క్-2, వడ్డేర బస్తీ ప్రాంతాల్లో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యు జి డి) పనులను సోమవారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నగరాభివృద్ధిలో మౌలిక సదుపాయాల ప్రాధాన్యత ఎంతో ఉంటుందని, ప్రజలకు మెరుగైన పారిశుధ్య నీటి పారుదల సౌకర్యాలను అందించడానికి ఈ యు జి డి ప్రాజెక్టు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందిని. ప్రజలకు అధునాతన వసతులు అందించేందుకు తాను అన్నివిధాల కృషి చేస్తున్నానని అన్నారు. అనంతరం త్వరితగతిన ఈ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవేందర్ యాదవ్, రవీందర్ యాదవ్, వినోద్, ప్రవీణ్ రావు, డప్పు కిరణ్, లక్మణ్, సంగీత రెడ్డి, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీపిసికి పెరుగుతున్న భూదాహం !!

● ఆగమేఘాలపై పవర్ స్టోరేజ్ రూమ్ భూమి చదును పనులు ● అవసరానికంటే ఎక్కువ భూములు సేకరిస్తున్న ఎన్టీపిసి ● సోలార్ ప్లాంట్ ఇక్కడి నుంచి తరలించాల్సిందే ● కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీటి బాలరాజు





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎన్టీపిసికి రాను రాను భూ దాహం పెరిగిపోతున్నదని తీవ్ర స్థాయిలో కంపెనీపై ఆఆరోపణలు చేశారు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ ధీటి బాలరాజు. ఈ మేరకు సోమవారం ప్రకటనలో ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్ పక్కన పవర్ స్టోరేజ్ రూమ్ కొరకు చేపసుతున్న భూమి చదును పనులను తక్షణమే ఆపివేయాలని, సోలార్ ప్లాంట్ సైతం జనావాసాల మధ్య కాకుండా సురక్షితమైన ఇతర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. 6వేల ఎకరాలు మాత్రమే అవసరమైన సంస్థ కంపెనీ ప్రారంభించినప్పుడే 9వేల ఎకరాలు సేకరించినది అని ఇది తీవ్ర మోసపూరితమని ప్రభుత్వం నుండి అనవసరంగా కొనుగోలు చేయడం అని ఆవేదన వ్యక్తం చేశారు. సిటీ మధ్యలో, రాజీవ్ రహదారిపై ఆనుకొని ఉన్న స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, కమర్షియల్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ఆ నిర్మాణ పనులు ఆపివేసి సోలార్ ప్లాంట్ తరలించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, నాయకులు, స్థానిక శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ నాయకత్వంలో నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని కంపెనీ యాజమాన్యాన్ని ప్రకటనలో హెచ్చరించారు.

# ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్!!

● ఒకే ఒక్క "ఫోన్ కాల్"తో వారియర్స్ అందుబాటులోకి ● సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు అండగా ఉండటమే లక్ష్యం ● ఏఐ టెక్నాలజీతో చెలరేగిపోతున్న మోసగాళ్లు ● రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**అవగాహనా రాహిత్యం, సులభ సంపాదన లక్ష్యంగా డిజిటల్ పెట్టుబడుల రూపంలో నష్టపోతున్న బాధితులకు సైబర్ వారియర్స్ ద్వారా న్యాయం జరగనుంది అని ఆ మేరకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్లో సైబర్ వారియర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్. ఈ మేరకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సైబర్ వారియర్స్ సిబ్బందితో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి సీపీ పలు సూచనలను చేశారు. బాధితులు సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా ఒకే ఒక్క ఫోన్ కాల్ చేసి ఫిర్యాదు చేస్తే వారియర్స్ అందుబాటులోకి వస్తారని తెలిపారు. 1930 ద్వారా ఫిర్యాదులను స్వీకరించి న్యాయం జరిగేలా కృషి చేస్తారని తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బంది పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే సైబర్ నేరాల కేసులపై నిరంతరం అప్రమత్తంగా ఉంటారని అన్నారు. ఏఐ టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారని అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిసిపి అడ్మిన్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి, సైబర్ క్రైమ్ ఇన్ స్పెక్టర్, సిబ్బంది, వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబెల్లికి ఎదురు దెబ్బ

● ఎర్రబెల్లి వ్యవహారాలు నచ్చక కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు ● బిల్లా సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరికతో పాలకుర్తి నియోజకవర్గంలోబిఆర్ఎస్ కు బిగ్ షాక్ ● సుధీర్ రెడ్డికి ఆయన అనుచరులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి





**తొర్రూర్ ఫిబ్రవరి 10(వార్తా ప్రభ)** పాలకుర్తి నియోజకవర్గం లో ఎర్రబెల్లికి ఎదురుదెబ్బ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో యశస్విని రెడ్డి పై ఓడిపోయి, పార్లమెంటు ఎన్నికల్లో, ఎర్రబెల్లి ఏసిన ఎత్తుగడలు నియోజకవర్గ ప్రజలు చిత్తు చేయడంతో, గత కొద్ది రోజులుగా, ఎర్రబెల్లి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడం తలమునకలుగా మారింది, స్థానిక సంస్థల ఎన్నికలు సంతరిస్తున్న తరుణంలో, ఎర్రబెల్లి దయాకర్ రావు తో దశాబ్దికాలంగా కలసి పనిచేసిన ముఖ్య నాయకులు, ఎర్రబెల్లి వ్యవహారాలకు విసుకు చెంది బి ఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనప్పటికీ ఎర్రబెల్లి రాజకీయాలు పాలకుర్తిలో నల్లేరు మీద నడకే అన్న చందంగా మారాయి, అనడానికి ఇదే సాక్ష్యంగా కనిపిస్తుంది. పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలానికి చెందిన, బిల్లా సుధీర్ రెడ్డి గత పదిహేళ్లుగా ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రధాన అనుచరుడిగా పనిచేసి, ఆయన మాటే శాసనంగా భావించిన వ్యక్తిగా సుధీర్ రెడ్డి మండలంలో ముద్ర వేసుకున్నాడు, ఎర్రబెల్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడైతే ఓటమి చెందాడో, బి ఆర్ఎస్ కార్యకర్తల్లో కలవరం మొదలైంది, దానికి తోడుగా పదేళ్లలో ఎర్రబెల్లి పాలకుర్తి నియోజకవర్గంలో కార్యకర్తలకు నాయకులకు వర్గబెట్టింది ఏమీ లేదని సొంత పార్టీ నాయకులు బాహాటంగా చెప్పుకోవడం విశేషం. నమ్మిన నాయకులను కార్యకర్తలను గత పదిహేనేళ్లుగా, రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదగకుండా, వారిని వాడుకోవడమే పనిగా పెట్టుకుని, నమ్మిన వారిని నట్లేట్లో ముంచినట్టుగా, గత 15 నీళ్లుగా ఈ ప్రాంతంలో ఎర్రబెల్లి పని చేశాడని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గత 2009 సంవత్సరంలో నియోజకవర్గాల విభజనలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత, ఎర్రబెల్లి, యతి రాజారావు కుటుంబాన్ని, వాళ్ల రాజకీయాలను అధ్యయనం చేసి, వర్ధన్నపేట నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో, ఎర్రబెల్లి పాలకుర్తి నియోజకవర్గం పై కన్నేశాడని, విమర్శలు లేకపోలేదు, ఆనాటి మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు డాక్టర్ సుధాకర్ రావును మభ్యపెట్టి, పాలకుర్తి నియోజకవర్గంలో టిడిపిపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆనాటి టిడిపి పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, దగ్గర ఎమ్మెల్యే టికెట్ బీఫామ్ తెచ్చుకొని, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పట్టు సాధించాడని, గెలిచిన నాటి నుండి నేటి వరకు, పాలకుర్తి ప్రాంత ప్రజలను సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా, దోపిడికి గురి చేశాడని, వివిధ మండలాల కార్యకర్తలు నాయకులు చెప్పుకొస్తున్నారు, ఇలాంటి నాయకుడు, మాకొద్దు, బాబోయ్ అంటున్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి గతంలో ఏ సంబంధం లేని వ్యక్తి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇక్కడ ఉండడం మూలంగానే పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి అనేది 50 ఏళ్లు వెనక్కి పోయిందని, దానిని గమనించిన ఎర్రబెల్లి అనుచరులే, పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో, బి ఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరుతున్నారని సమాచారం, ఈ సందర్భంలోఎర్రబెల్లి దిక్కు తోచని స్థితిలో ఉన్నాడని విశ్వసనీయ సమాచారం. గత 15 ఏళ్ల తర్వాత ఝాన్సీ రెడ్డిపాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలానికి చెందిన స్థానిక వ్యక్తీ గా, ఈ ప్రాంతంలో అడుగుపెట్టడంతో, స్థానిక నాయకురాలికి, జనం జేజేలు కొట్టడం జరిగిందని,, ఆమె సప్త సముద్రాలు దాటిన, తన ప్రాంతానికి చేసే సేవలను మరిచిపోలేదని నమ్మిన ప్రజలు నాయకులు కార్యకర్తలు వారి సేవలను నియోజకవర్గ ప్రజలకు అందే విధంగా అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లి అభివృద్ధి బాట నడవాలని ఆలోచనతోనే, ఝాన్సీ రెడ్డి గుమ్మం తట్టడానికి ప్రధాన కారణమని భావించవచ్చు. ఈ చేరికల విధానం చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ గెలుపే ఏకైక లక్ష్యంగా ఉండేలా పనిచేస్తున్నట్టు ముఖ్య సమాచారం

వార్తా ప్రభ

# హైదరాబాద్

## నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనలో త్వరితగతిన చర్యలు తీసుకుంటాం

- మంజీరా మంచినీటి పైపు పగిలిన ప్రాంతంలో కార్పొరేటర్ శ్రీకాంత్ కలిసి పర్యటించిన ఎమ్మెల్యే





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం రోడ్డులో సత్యలక్ష్మి నగర్ కాలనీ వద్ద మంజీర మంచి నీటి పైప్ లైన్ అకస్మాత్తుగా పగిలిపోవడం వలన వెంటనే చేపట్టిన పైప్ లైన్ పునరుద్ధరణ పనులను,జలమండలి అధికారులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మంజీర పైప్ లైన్ పగిలిపోయిన విషయం తెలియగానే సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగినదని,చాలా సంవత్సరాల క్రితం వేసిన పాత పైపులు అవడం వలన,వాటి జీవిత కాలం తగ్గడం వలన,కరెంట్ అన్,ఆఫ్ చేసే క్రమంలో గల సమయంలో గ్యాస్ వాయువు ఏర్పడి పగిలిపోవడం జరుగుతుందని,ఇటువంటి సమస్యలు మళ్ళీ పునరావృతం కాకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటామని,ఇట్టి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతామని,పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు.అదేవిధంగా మంజీర పైప్ లైన్ ఆకస్మికంగా పగిలిపోవడం చాలా దురదృష్టకరం అని,పైప్ లైన్ పగిలిపోవడం మంచినీటి సరఫరా లో ఇబ్బంది ఎదురైనదని, జలమండలి,జిహెచ్ఎంసి ,ట్రాఫిక్ విభాగం అధికారులు సమన్వయం చేసుకొని పైప్ లైన్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టి, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కృషి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగినదన్నారు.పనులలో వేగం పెంచి,నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు,శేరిలింగంపల్లి నియోజకవర్గం లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తానని,ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి వస్తే పరిష్కరిస్తానని,అన్ని వేళలో అందుబాటులో ఉంటానని పీఏసి చైర్మన్ గాంధీ తెలియజేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డిజీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టేస్టి ఫుడ్ ఫెయిర్ సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం హెచ్ఏయల్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సోమవారం రిచ్ మైండ్స్ ఎలిమెంటరీ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెస్టి ఫుడ్ ఫెయిర్ లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు వండిన రుచికరమైన వంటలు తిన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ...ముందుగా రుచికరమైన పదార్థాలు తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. విద్యతో పాటు సమసమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తిత్వం కూడ అలవర్చుకోవాలన్నారు. నైతిక విలువలు,నైపుణ్య అభివృద్ధి పెంపొందించే అంశాలపై దృష్టి సాధించాలని, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహమ్మద్ మెహబూబ్ అలీ, అకాడమిక్ డైరెక్టర్ మహమ్మద్ బిలాల్, ప్రిన్సిపల్ మంజుల సురేఖ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీర్జా రషీద్ బేగ్, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ యువ కేంద్ర, మై భారత్, శివసేన యూత్ క్లబ్ ఆధ్వర్యంలోక్రీడాపోటీలు

**వేములవాడ, ఫిబ్రవరి 10: (వార్తాప్రభ)** నెహ్రూ యువ కేంద్ర మై భారత్, శివసేన యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వేములవాడ పరిధిలోని బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ షెటిల్‌లి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యూత్ ఆఫీసర్ వెంకట రాంబాబు హాజరై, ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు శారీరకంగా దృఢంగా ఉండాలని, రోజువారి తమ సమయంలో కొద్ది సమయాన్ని వ్యాయామానికి కేటాయిస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం కబడ్డీ మొదటి స్థానం చెక్కపల్లి, వాలీబాల్ మొదటి స్థానం జేఎన్టీయూ అగ్రహారం జట్లకు క్రీడా సామాగ్రి అందజేశారు. రన్నింగ్ బ్యాట్మింటన్ షాట్ పుట్ వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ మెమొండోస్ అలాగే క్రీడాకారులందరికీ సర్టిఫికెట్లను అందజేశారు.

# ఎడిటోరియల్

## ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బయటకు రాని ఆసక్తికర అంశాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. ఓట్ల లెక్కింపు వేళ.. చీపురు పార్టీని కమలం ఊడ్చేసిందన్న వాదనలు వినిపించాయి. అయితే.. ఫలితాలు పూర్తిగా వెల్లడైన తర్వాత.. ఆయా పార్టీలు సాధించిన సీట్లు.. వాటి మెజార్టీలు.. అభ్యర్థులు సాధించిన అధిక్యతలు.. గత ఎన్నికల ఫలితాల్లో రెండు పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసం.. తాజాగా చోటు చేసుకున్న మార్పులు లాంటి అంశాలపై ఫోకస్ చేస్తే.. ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తాయి. ఎన్నికల్లో విజయం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ.. బీజేపీ రెండూ హోరాహోరీగా తలపడిన విషయం అర్థమవుతుంది. సీట్ల పరంగా చూస్తే.. బీజేపీ భారీగా సీట్లను సొంతం చేసుకున్నట్లు కనిపించినా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమి తక్కువ రేంజ్ లోనే ఎదురైన వైనం అర్థమవుతుంది. 2020 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో తాజా ఫలితాల్ని విశ్లేషిస్తే.. తక్కువ మెజార్టీతో బీజేపీ విజయం సాధించిన విషయం అర్థమవుతుంది. అలా అని బీజేపీ విజయాన్ని చూపించాలన్నది మా ఉద్దేశం కాదు. ఎన్నికల ఫలితాల్ని చూసినపపుడు.. గణాంకాల లోతుల్లోకి వెళ్లినప్పుడు ఉండే వ్యత్యాసాలు ఎంత ఆసక్తికరంగా ఉంటాయన్నది ఢిల్లీ ఫలితాల్ని విశ్లేషిస్తే అర్థమవుతుంది. 2020తో పోలిస్తే తక్కువ మెజార్టీతో విజయం సాధించిన వైనం కనిపిస్తుంది. పది వేల కంటే తక్కువ మెజార్టీతో పార్టీలు విజయం సాధించిన స్థానాలు 24. అదే 2020 ఎన్నికల్లో వీటి సంఖ్య 15 మాత్రమే. ఈ 24 స్థానాల్లో బీజేపీ గెలిచినవి 16 కాగా.. ఆప్ కు దక్కినవి 8 మాత్రమే. అంటే.. తక్కువ మెజార్టీతో విజయాన్ని సాధించిన బీజేపీ అధికారపక్షంగా అవతరిస్తే.. తక్కువ మెజార్టీతో ఓడిన స్థానాల్ ఆమ్ ఆద్మీ పార్టీకి అధికారాన్ని దూరమయ్యేలా చేవాయి. 2020 ఎన్నికల్లో 33 స్థానాల్లో 10 వేలకు మించిన మెజార్టీ రాగా.. ఈసారి 29 స్థానాలకు తగ్గింది. ఈ ఎన్నికల ఫలితాల గణాంకాల్ని చూస్తే.. 13 అసెంబ్లీ స్థానాల్లో 5 వేల లోపు ఓట్ల మెజార్టీ నమోదైంది. అదే సమయంలో భారీ మెజార్టీతో గెలిచిన స్థానాలు తగ్గాయి. 2020 ఎన్నికల ఫలితాల్లో 22 స్థానాల్లో 25వేలకు మించిన మెజార్టీతో అభ్యర్థులు విజయం సాధిస్తే.. ఈసారి అది 17 స్థానాలకే పరిమితమైంది. అతి తక్కువ ఓట్ల మెజార్టీతో విజయాన్ని సొంతం చేసుకున్న బీజేపీ అభ్యర్థుల్ని చూస్తే.. సంగం విహార్ నియోజకవర్గంలో బీజేపీ నేత చందన్ కుమార్ చౌదరి కేవలం 344 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.అదే విధంగా త్రిలోక్ పురీలో 392 ఓట్లు.. జంగ్ పురాలో 675 ఓట్ల మెజార్టీతోనే బీజేపీ అభ్యర్థులు గట్టెక్కారు. 2020లో 5 వేల లోపు మెజార్టీలు 7 కాగా.. ఈసారి పదిగా నమోదయ్యాయి. మొత్తంగా ఈ గణాంకాల్ని చూసినప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బీజేపీ – ఆమ్ ఆద్మీ పార్టీ మధ్య హోరాహోరీగా సాగినట్లుగా అర్థమవుతుంది. ఇదంతా చూసినప్పుడు కాంగ్రెస్ తో ఆమ్ ఆద్మీ పార్టీ కానీ పొత్తు పెట్టుకుంటే.. ఆశ్చర్యకర ఫలితాలు వెలువడినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండేది కాదేమో అన్న అభిప్రాయం వ్యక్తం కాక మానదు.

## పిహెచ్సి పరిధిలో నులి పురుగులు మాత్రలు పంపిణీ



**కలువాయి ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 39 అంగన్వాడి స్కూల్స్ 35 గవర్నమెంట్ స్కూల్స్ 3 ప్రైవేట్ స్కూల్స్ నందు గల అర్హులైన పిల్లలందరికీ ఈ రోజున ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరిగినది.ఈ కార్యక్రమము నందు 4285 మంది పిల్లలకు గాను 4168 మందికి (97%) ఆరోగ్య సిబ్బంది ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా కలువాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం విజయలక్ష్మి మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి బాలకొండయ్య మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఒత్తిడి లేని విద్యపై అవగాహన



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 10(వార్తాప్రభ)**బాపులపాడు మండలం రేమల్లె జడ్పీ హైస్కూల్ లో పరీక్షపే చర్చ అనే కార్యక్రమం ను విద్యార్థులు సోమవారం వీక్షించారు. టీవీ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు ఎన్నో సూచనలు చేశారు. పాఠశాల హెచ్ఎం లూథర్వాల్, సోషల్ టీచర్ దారపురెడ్డి భాస్కరరావు, తెలుగు ఉపాధ్యాయులు పార్థసారథి లు విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యపై అవగాహన కల్పించారు. పరీక్షలలో మెలకువలు, తీసుకోవలసిన జాగ్రత్తలు సోదాహరణంగా వివరించారు. శ్రద్ధగా చదివి ప్రగతి సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

## బాలలు ద్రాక్ష తీగలు

ద్రాక్ష తీగలు బాలలు
దాని గుత్తుల సొగసులు
పచ్చ పచ్చని ఆకులు
తీయతీయని ఫలములు
ద్రాక్ష తోటలు అందము
పిల్లల పలుకుల వోలె
దాని రసమే మధురము
రోగాలకు ఔషధము
రాగి, ఇనుము, మాంగనీస్
వంటి సూక్ష్మ పోషకాలు
ద్రాక్షలో కోకొల్లలు
ఎముకల పుష్టికి మేలు
కేన్సర్ వంటి వ్యాధులు
అరికట్టునోయ్! ద్రాక్షలు
తరుచుగా తింటే చాలు
చాలా ఉపయోగాలు
రక్తప్రసరణ మెరుగుపడును
మల బద్ధకం తగ్గును
విటమిన్ సి,కె లూ ఎక్కువ



ఎండితే "కిస్మిస్"లగును
ఎండిన కూడా లాభము
వాడెదరు వంటల్లో
ద్రాక్ష వలన క్షేమము
అందరికీ బహు ఇష్టము

**గద్వాల సోమన్న,**
9966414580

# వికసిత్ పంచాయత్ లక్ష్యంగా గ్రామాభివృద్ధికి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ముందడుగు

**● ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. సహకారంతో కేశినేని ఫౌండేషన్ ద్వారా సొంత నిధులతో శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాటు ● పార్లమెంట్ పరిధిలో 100 మంది యువతీయువకులు ఎంపిక ● తొలి విడతగా 33 మంది యువకులకి హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. సంస్థలో శిక్షణ ● ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ లో ఫిబ్రవరి 10 నుంచి 16 వరకు వారం రోజులు పాటు శిక్షణ కార్యక్రమం ● జెండా ఊపి బస్సును ప్రారంభించిన గొట్టుముక్కల, డూండీ, మాజీ మేయర్ కోనేరు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా మాటలు కోటలు దాటించే రాజకీయ నాయకులుకుభిన్నంగా ....నా నియోజకవర్గ ప్రజలకు నేనేం చెయ్యాలో ఆలోచించి తాత్కాలిక ప్రయోజనాలతో ఆహా ఓహో అనిపించుకునే వారిలా కాకుండా రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా నూతన ఒరవడి కి శ్రీకారం చుట్టిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారని చెప్పవచ్చు.తన పార్లమెంట్ పరిధిలోని 294 గ్రామాలను అభివృద్ధి చేయటమే కాకుండా , దేశంలోనే మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయ సాధనలో భాగంగా ప్రతి కుటుంబంలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండే విధంగా ఎంపి కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 294 గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయటానికి ఉపాధి కల్పన,మహిళా సాధికారత, గ్రామీణ విద్య, ఆరోగ్యంపై దృష్టి, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి) రూపొందించడం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల నిర్వహణ, స్వచ్ఛ గ్రామ %-% హరిత గ్రామ అభివృద్ధి, డిజిటల్ సేవల ద్వారా పంచాయతీ పరిపాలన, ఫ్రెండ్లీ విమెన్ , గ్రౌండ్ వాటర్ స్టోరేజ్ అనేక రకాలుగా గ్రామాలను పరిపూర్ణం అభివృద్ధి చేయటం కోసం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ మరియు పంచాయితీరాజ్ సంస్థల సహకారంతో ముందడుగు వేశారు.వికసిత్ పంచాయిత్ లో భాగంగా విజయవాడ పార్లమెంట్ పరిధిలో 294 గ్రామాలను ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో అభివృద్ధి చేసేందుకు 100 మంది యువతీ యువకులకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇప్పించేందుకు ఎంపిక చేశారు. వీరిలో తొలివిడతగా తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండల నుంచి తొమ్మిది మంది, మైలవరం నియోజకవర్గం జి.కొండూరు నుంచి ఎనిమిది మంది, జగ్గయ్యపేట నియోజకవర్గం జగ్గయ్యపేట రూరల్ మండలం నుంచి 8 మంది, నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం నుంచి 8 మంది మొత్తం 33 మంది యువకులను హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ లో ఫిబవరి 10 నుంచి 16 వరకు వారం రోజులు పాటు జరగబోయే శిక్షణ కార్యక్రమంకు ఆదివారం బస్సులో పంపించారు.గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ నుంచి హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ కి ఆదివారం మధ్యాహ్నం బస్సు బయలుదేరింది. ఈ బస్సును ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆర్యవైశ్య డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ జెండా ఊపి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డూండీ రాకేష్, మాట్లాడుతూ హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ లో నవంబర్ 1, 2024న ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) స్వయం ఉపాధి అవకాశాలపై ఒక రోజు శిక్షణ తీసుకున్నారని, ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో దేశంలోనే మోడల్ గ్రామాలుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణకి వెళ్లే యువతీయువకులకి తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ద్వారా నెలకి పది వేల రూపాయల ఉపకార వేతనం అందించటంతో పాటు, ఈ వారం రోజుల శిక్షణకు సంబంధించి అయ్యే ఖర్చు రూ.15 లక్షల రూపాయలు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఎన్.ఐ.ఆర్.డికి చెల్లించారని తెలిపారు.వారం రోజుల పాటు శిక్షణ పొందిన వచ్చిన వారు రాబోయే కాలంలో వారి మండలాల్లోని గ్రామాల అభివృద్ధి కి కృషిచేస్తారని చెప్పారు. శిక్షణ పొందిన వారు గ్రామాలకు తిరిగి వచ్చిన తర్వాత వారి గ్రామాభివృద్ధికి అవసరమైన వాటిని గుర్తించి ఎంపి కేశినేని శివనాథ్ కి అందజేస్తే ఆ గ్రామాలకు వాటిని ఎంపి కేశినేని శివనాథ్ అందజేస్తారని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలను ఎన్టీఆర్ జిల్లాలో సాకారం చేసేందుకు ఎంపి కేశినేని శివనాథ్ అకుంఠిత దీక్షతో పని చేస్తున్నారన్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఇతర జిల్లా అధికారులు, యువత యువకులు, జిల్లా డ్వాక్రా సంఘ సమైక్య అధ్యక్షులు అన్ని మండలాల డ్వాక్రా సంఘాల సమైక్య అధ్యక్షులతో ఎంపి కేశినేని శివనాథ్ సమావేశాలు నిర్వహించటంతోపాటు, ఇప్పటికే 64 మంది స్వయం సహాయక సంఘాల సమైక్య అధ్యక్షురాలకు స్వయం ఉపాధి రంగం పై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి పంపించటం జరిగిందన్నారు. ఎన్.ఐ.ఆర్.డిలో వున్న 70 రకాల స్వయం ఉపాధి అంశాలపై అవగాహన పెంచుకున్నారని తెలిపారు. తన పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాలు ఒకేసారి అభివృద్ధి చెందే విధంగా ప్రతి మండలంలో క్లస్టర్స్ ఏర్పాటు చేసి వాటిని కేంద్ర ప్రభుత్వం పథకాలు, ఎన్.ఐ.ఆర్.డి సహకారంతో అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎంపి కేశినేని శివనాథ్ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి , మాజీ ఫ్లోర్ లీడర్ ఎరుబోతు రమణ , ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సొంగా సంజయ్ వర్మ. ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎస్ కే కరీముల్లా, ఎన్టీఆర్ జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి సాయి చరణ్. టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్ , ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జీవీ నరసింహారావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు....

# "దంతాల ప్రథమ శత్రువులు నోటిలో నివసించే సూక్ష్మజీవులే"

**-డాక్టర్ చల్లా చైతన్య, దంత వైద్య, శస్త్ర చికిత్సనిపుణులు**




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నోరు అనేక రకాల హానికర సూక్ష్మజీవులకు నిలయమని నోరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోకపోతే, నోటి దుర్వాసన ,పుండ్లు పడడం, చిగుళ్ల వాపు, దంతాలు ఊడటం వంటి సమస్యలు తలెత్తుతాయని కాస్మోడెంట్స్ దంత వైద్యశాల, దంత వైద్య , శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చల్లా చైతన్య అన్నారు. స్థానిక బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ భవనంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన "ఉచిత దంత వైద్య శిబిరం ,శాస్త్రీ అవగాహన సభ "లో డాక్టర్ చైతన్య పాల్గొని ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు .డాక్టర్ చైతన్య ప్రసంగాన్ని కొనసాగిస్తూ వయసు పెరిగిన కొద్దీ వయసుతో పాటే పళ్ళు ఊడిపోతాయనే భావన చాలామందిలో ఉందని, అయితే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే వయసుతోపాటు పళ్ళు రీ ఉన్న అన్ని ఊడడాన్ని నిరోధించవచ్చునన్నారు. పోషకాహార లోపం, విటమిన్ల లోపం నోటి వ్యాధులకు కూడా కారణమవుతాయి అన్నారు. నోటిలో దాదాపు 200 నుండి 300 రకాల సూక్ష్మ జీవులు 10 మిలియన్ల దాకా ఉంటాయన్నారు .అవి ఎప్పుడు మనం తినే ఆహార పదార్థాల్లోని పిండి పదార్థాలను ,చక్కెరలను వినియోగించుకుంటూ, వృద్ధి చెంది నోటి దుర్వాసనకు, దంత క్షయానికి కారణమవుతాయన్నారు. మనం నిద్రపోయే సమయంలో మరింతగా సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి అన్నారు. అందువల్ల నోటిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన శరీరంలో దంతాల వినియోగం ఎక్కువగా ఉంటుందని ,దంతాలలో ఉండే సిమెంట్, ఎనామిల్ ,నిత్యం వివిధ రకాల సూక్ష్మజీవుల కు, విష రసాయనాలకు గురవుతాయన్నారు. వీటికి తోడు చుట్ట, బీడీ ,సిగరెట్, మద్యం తాగే వారిలో ,గుట్కా కైని ,పాన్ మసాలా, వక్కపొడి వంటివి నమిలే వారిలోను నోటిలోని అన్ని అవయవాలైన నాలుక ,పెదాలు, దవడలతోపాటు, దంతక్షయం కూడా జరుగుతుందన్నారు. కొందరిలో దంతాలలో రంధ్రాలు ఏర్పడతా యన్నారు. వీటినే మనం పిప్పి పళ్ళు అంటామన్నారు .ఈ రంధ్రాలలో ఆహార పదార్థాలు ఇరుక్కుపోయి ,రంధ్రం కాస్త పెద్దదవుతుంది అన్నారు. మొదట్లో నొప్పి ఉండదన్నారు. రంధ్రంకొంత పెరిగి చివరకు చిగురుకు తాకాక ఆహారం నమలాలంటే నొప్పి పుడుతుందన్నారు .అతి చల్లదనాన్ని అతి వేడిని భరించలేరన్నారు .కనీసం చల్లని గాలి తగిలిన నొప్పి వస్తుందన్నారు .అప్పుడు రంధ్రాలను పూడం లేదా వాటిని పీకటం చేయవలసి వస్తుందన్నారు ముందు జాగ్రత్తలు తీసుకొని దంతాల సమస్యలను చాలావరకు నిరోధించవచ్చునన్నారు నోటిని ప్రతిరోజు ఆహారం తీసుకున్న తర్వాత శుభ్రం చేసుకోవాలన్నారు వృద్ధులు దంతాలు ఊడిపోతే కృత్రిమ దంతాలను అమర్చుకోవాలి అన్నారు లేకపోతే ఆ ప్రభావం పక్కన దంతాలపై పడి త్వరగా ఊడిపోతాయన్నారు ప్రతి ఒక్కరూ చిన్న వయసునుండేదంతా పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు సభాధ్యక్షులు టి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ నోటీ ఆరోగ్య%శీ% తోపాటు ,శరీర ఆరోగ్యం కూడా కాపాడుకోవాలన్నారు. వ్యాధులు వచ్చాక ,వైద్యుని సంప్రదించి ఆరోగ్యపరంగా ఆర్థికపరంగా నష్టపోకుండా ముందు జాగ్రత్తలతో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నదే తమ సంస్థల లక్ష్యం అన్నారు. సభానంతరం డాక్టర్ చైతన్య, దంత సమస్యల బాధ్యతులను పరీక్షించి వైద్య సలహాలు అందజేశారు. వైద్య శిబిరంలో ఎస్ హెచ్ ఓ మేనేజర్ పి. నిర్మలరాణి ,మే కల రామారావు,చావా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# మేరీ మాత ఉత్సవాల్లోచైల్డ్ ట్రాకింగ్ టాగ్ సిస్టమ్ వినియోగం

**ఘనంగా జరుగుతున్న ఈ ఏడాది మేరీ మాత ఉత్సవాలు**




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మేరీ మాత ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం నూతన టెక్నాలజీ ని ఉపయోగం లోకి తీసుకొచ్చింది. జిల్లా కలెక్టరు ఉత్తర్వలతో ఈ ఉత్సవలల్లో పాలొగొంటున్న జన సద్రముల్లో చిన్న పిల్లలు కి తప్పనిసరిగా చైల్డ్ ట్రాకింగ్ టాగ్ ని తప్పని సరి చేసేరు. దీని వలన రద్దీ సమోహం లో పొరపాటున పిల్లలు తప్పిపోతే వారిని ఈ ట్రాకింగ్ ద్వారా సులభముగా గుర్తించి వారి తల్లితండ్రులు కు అప్పగించే వీలు ఉంటుంది. ఈ వినూత్న మైన టెక్నాలజీ సిస్టమ్ ను గత రెండు రోజులుగా ఉత్సవలలో విధులు నిర్వహిస్తూన్న విజయవాడ పచ్చిమ. ఏమ్మార్వో ఇంతియాజ్ పాషా దగ్గర వుండి దీని అవసక్యతను దర్శనం కి వచ్చే తల్లి దండ్రులు కు తెలియ చేసి వారి పిల్లలు కు క్రమం తప్పకుండ ట్రాకింగ్ టాగ్ లు వేయిస్తున్నారు.

# బ్రదర్ అనిల్ కు సొంటి నాగరాజు శుభాకాంక్షలు



**పెదన ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి)** కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి భర్త అనిల్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా బిసి సెల్ విభాగం ఏపీ అధ్యక్షుడు పెదన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శొంఠి నాగరాజు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నాడు లోటస్పాండ్ లో అని ఆయన స్వయంగా కలుసుకున్నారు. అనిల్ చేత నాగరాజు కేక్ కట్ చేయించారు

# ఐ ఒ టి తో విస్తృత ఉద్యోగ అవకాశాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి)**అధునాతన సాంకేతికత అన్నిరంగాల్లోనూ అత్యున్నతమైన ప్రభావం చూపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అధ్యయనం ద్వారా విస్తృతమైన అవకాశాలను అందిపుచ్చుకోవడం తేలిక అవుతుందని ముంబైలోని డాక్టర్ సర్దార్ పాటేల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై. శ్రీనివాసరావు అన్నారు. కె.బి.ఎన్. కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో సోమవారం 'ఐ ఒ టి టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' అంశంపై కేబీఎన్ కళాశాల సెమినార్ హాల్లో వర్క్ షాప్ జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులలోని స్మార్ట్ బ్లాక్‌బోర్డుల నుండి పార్కిన్సన్స్ వ్యాధి సంకేతాలను గుర్తించగల వైద్య పరికరాల వరకు ఐ ఒ టి అనుసంధాన వ్యవస్థ అవసరమవుతోందన్నారు. ఐ ఒ టి ద్వారా ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందన్నారు. మార్కెట్ అంచనాల ప్రకారం 2025 చివరికి మనదేశంలో ఐ ఒ టి వినియోగం 22 శాతం పెరిగి, 27 బిలియన్ పరికాలకు ఈ టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందన్నారు. సెన్సార్లన్ డివైజ్ లతో అనుసంధానం చేయడం, వివిధ సెన్సార్ల క్రియాశీలత, క్లౌడ్ ప్లాట్ ఫాం సాఫ్ట్ వేర్ ను వినియోగించే విధానం గురించి శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఉదాహరణ పూర్వకంగా సమాధానాలు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దటానికి వర్క్ షాపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఆర్. ఉదయ్ కుమార్, అధ్యాపకులు బి.శృతి పాల్గొన్నారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకునిపై దాడి బాధాకరం

**వైసీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు రాష్ట్రాలలో ఆలయాలు, హిందూమతానికే కాకుండా, అర్చకులకు రక్షణ లేకుండా పోతోందని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకునిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. దేవుడి సేవలో ఉన్న అర్చకునిపై దాడికి తెగించడం దారుణమని.. సమాజం బాగుండాలని నిత్యం కైంకర్యాలు, పూజలు నిర్వహించి దైవ దూతలుగా భావించే అర్చకులపై వరుస దాడులు కలచివేస్తున్నాయన్నారు. చిలుకూరు ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులకు సరైన రక్షణ కల్పించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

# టాలెంట్ టెస్ట్ లో మూడు స్థానాలు లుంబిని కైవసం

**ప్రతిభ కనబరిచిన హిమవర్ణ.. సాయి వెంకట చరన్.. ఉడతా అనూష**



**చేజర్ల ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** అనంతసాగరంలో ఆపస్ వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ నందు చేజర్ల మండల ప్రైవేట్ పాఠశాల అయిన లుంబిని విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.ఎనిమిది మండలాల నుండి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టేలెంట్ టెస్టు నందు పాల్గొనగా అందులో లుంబిని విద్యార్థులు మొదటి ఏడవ మరియు తొమ్మిదవ స్థానాలను కైవసం చేసుకున్నారు.1వ స్థానంలో కె.హిమవర్ణ 7వ స్థానంలో వి.సాయి వెంకట చరణ్ 9వ స్థానంలో ఉడతా అనూష అను వారు నిలిచారు. ఆ విద్యార్థులకు ఉపాధ్యాయుని ఉపాద్యాయులు మరియు పాఠశాల మేనేజ్మెంట్ మరియు కరెస్పాండెంట్ బి.రమేష్ అభినందనలు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు మూడు స్థానాలు సాధించడంతో పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఏపిలో గత ఐదేళ్లలో 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ ఏర్పాటు

● పలు పరిశ్రమల నైపుణ్య లోటుపై అధ్యయనాలు ● కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత (స్వతంత్ర బాధ్యత) ● శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరీ వెల్లడి
● ఆంధ్రప్రదేశ్ లో నైపుణ్య లోటు అధ్యయనాల పై ప్రశ్నించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్.ఎస్.డి.సి) ఆధ్వర్యంలో 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ స్థాపించటం జరిగింది. 2019 నుండి ఈ సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ ఎపిలో పలు పరిశ్రమల అవసరాన్ని బట్టి నైపుణ్య లోటు అధ్యయనాలు నిర్వహించటం జరిగిందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత (స్వతంత్ర బాధ్యత) శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో గత ఐదేళ్లలో సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ ద్వారా చేపట్టిన నైపుణ్య లోటు అధ్యయనాల (స్కిల్ గాప్ స్టడీస్) వివరాలు, ఎన్ని జిల్లాల్లో ఈ అధ్యయనాలు నిర్వహించబడ్డాయనే వివరాలు, కొత్త ఏర్పడిన జిల్లాల్లో ఈ అధ్యయనాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఏదైనా ప్రతిపాదనాలు పంపించటం జరిగిందా అనే అంశాలపై ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖను లోక్ సభలో సోమవారం ప్రశ్నించారు. వీటికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత (స్వతంత్ర బాధ్యత) శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరీ లిఖిత పూర్వకంగా సమాధానం తెలిపారు. ఎపిలో 2019 నుండి వివిధ సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ కార్మిక వనరుల పరిశీలన, నైపుణ్య అభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలు, పరిశ్రమ అవసరాలను అంచనా వేయడం వంటి అంశాలపై అధ్యయనాలు నిర్వహించాయి. 2019లో ఆటోమోటివ్ నైపుణ్య అభివృద్ధి మండలి అధ్యయనం నిర్వహించగా, బి.ఎఫ్.ఎస్.ఐ రంగానికి సంబంధించి 2020లో అధ్యయనం జరిగిందని పేర్కొన్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో పలు రంగాలకు సంబంధించి సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ (%బాజం%) అధ్యయనాలు చేపట్టినట్లు తెలిపారు. 2023లో వ్యవసాయ, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, గ్రీన్ జాబ్స్ రంగాలకు సంబంధించి అధ్యయనాలు జరగ్గా, 2024లో టెలికాం, పర్యాటక అతిథ్య రంగాల్లో పరిశీలనలు జరిగినట్లు తెలిపారు. ఈ అధ్యయనాలు నైపుణ్య లోటును గుర్తించి, సంబంధిత రంగాల్లో శిక్షణా కార్యక్రమాలను మెరుగుపరిచేలా మార్గదర్శకాలు అందించాయని చెప్పారు. నైపుణ్య లోటును సమర్థవంతంగా అంచనా వేయడానికి సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ ( %బాజ%) లు కొన్ని ప్రత్యేక జిల్లాల్లో అధ్యయనాలు చేపట్టగా. ఆటోమోటివ్, నిర్మాణ, హైడ్రోకార్బన్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ పరిశీలనలు నిర్వహించగా, ఇతర పరిశ్రమల్లో ముఖ్యంగా తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, అమరావతి, చిత్తూరు, కొనసీమ, కృష్ణ, గుంటూరు, అనంతపురం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో పరిశోధనలు జరిగినట్లు పేర్కొన్నారు..ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నైపుణ్య అభివృద్ధికి అవసరమైన డిమాండ్‌ను గుర్తించేందుకు జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రణాళికలు 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ ప్రణాళికల ప్రకారం, పరిశ్రమల అవసరాలను అంచనా వేసి, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయనుందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పరిశీలనలు ఆలస్యం కావడానికి పలు కారణాలు ఉన్నాయన్నారు. పరిశ్రమల అభివృద్ధి ఇంకా కొనసాగుతుండటం, ప్రభుత్వ ప్రాధాన్యత మౌలిక వనరుల అభివృద్ధికి కేంద్రీకృతమై ఉండటం, కొన్ని సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ రాష్ట్ర స్థాయిలో మాత్రమే అధ్యయనాలు నిర్వహించడం వంటివి ఆలస్యానికి కారణంగా పేర్కొన్నారు.. అయితే, ప్రభుత్వ అనుసంధాన సంస్థలు త్వరలో ఈ జిల్లాలకు ప్రత్యేక అధ్యయనాలు చేపట్టే అవకాశముందని తెలిపారు. అలాగే ప్రభుత్వం నైపుణ్య లోటు (స్కిల్ గాప్ స్టడీస్)ను భర్తీ చేసే దిశగా మరిన్ని పరిశీలనలు చేపట్టేలా ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను మరింత సమగ్రంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

## విద్యార్థులకు నులి పురుగు మాత్రలు పంపిణి



**చేజర్ల ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ మెహతాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.అనంతరం మెడికల్ ఆఫీసర్ మెహతాబ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు శుభ్రత పరిశుభ్రత పాటించాలని అలాగే ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా కడుపులో ఉన్నటువంటి ఏటికి పాములు నులిపురుగులు దబ్బ పురుగులు రక్తహీనతకు కారణమైన మొదలగు పురుగులు చనిపోతాయని తద్వారా మనకు మంచి ఆకలి నిద్ర వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ బి.నరసమ్మ ఏఎన్ఎం లక్ష్మీనారాయణమ్మ ఆశా పవిత్ర కళాశాల అధ్యాపకులు మల్లేశ్వరరావు సంధాని భాష నాగమల్లేశ్వరమ్మ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ పై విస్తృతంగా చర్యలు చేపట్టాలి

**విజయవాడ నగర పాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాలు**




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై విస్తృతమైన చర్యలు చేపట్టాలని విజయవాడ నగర పాలక సంస్థ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం శాఖాధిపతులతో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రతి సర్కిల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బాన్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలని దానికనుగుణంగా వినియోగదారులను గుర్తించి వారితో ఒక సమావేశం నిర్వహించి 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకని సంపూర్ణంగా నగరపాలక సంస్థ నిషేధిస్తోంది అన్న విషయాన్ని తెలపాలని అధికారులను ఆదేశించారు.ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వలన పర్యావరణానికి కాకుండా ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందని, కావున పర్యావరణ పరిరక్షణ మరియు నగర పౌరుల ఆరోగ్యం కొరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ ను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవిజి ఎస్ వి ప్రసాద్, ఎంజాయ్ చెయ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ పి సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సిడి వోలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్చకులపై దాడులు అమానవీయం

● మనిషిగా పుట్టిన ప్రతిఒక్కరికి దైనందన జీవితం అర్చకులతో ముడిపడి ఉంది ● ఓనమాలు దిద్దేందుకు మేమే..ఊపిరి ఆగినప్పుడు మేమే ● అలాంటి మాపై అమానుష దాడులా ● బాపట్ల జిల్లా అర్చక సేవా సంఘం నేతల ఆవేదన

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగ రాజన్ పై దాడిని బ్రాహ్మణ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి రంగ రాజన్ ను అవమానిస్తే దేవుణ్ణి అవమానించినట్టేనని నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సంఘాలు కోరాయి. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా సేవా సంఘ అధ్యక్షులు రావూరి ఆంజనేయులు జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నపల్లి సత్యనారాయణ తమ ఆవేదన వ్యక్తంచేశారు. ఇది అమానవీయ సంఘటనని మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరి జీవితం అర్చకులతో ముడిపడి ఉందని ఓనమాలు దిద్దేందుకు, సహధర్మచారిణికి మూడు ముళ్ల వేసినా అమెతో ఏడడగులు నడిచినా తాము వేద మంత్రాలు చదవాల్సిందే..మనిషి వూపిరి ఆగినా ఆత్మశాంతి కోసం తామే మంత్రోచ్చారణ చేయాలని అలాంటి మాపై అమానుషంగా దాడులు చేయడం నీచమైన చర్య అని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

## రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరం

**మాముడూరు రైతులతో వ్యవసాయ శాఖ అధికారి శశిధర్**



**చేజర్ల ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసేందుకు పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం జరిగినది.ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది.పీఎం కిసాన్ చెల్లింపులు అన్నదాత సుఖీభవ పంటల భీమా పంట రుణాలపై వడ్డీ రాయితీపై తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుంది.సత్వర పరిహారం అందుటకు ఉపయోగపడుతుంది.గ్రామంలో గల రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి రైతుకుఆధార్ నెంబర్ ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్ భూమి రికార్డులు వివరములు పట్టాదారు పాస్ బుక్‌తీసుకొని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి వ్యవసాయ గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శశిధర్ మాముడూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు.ఇదే విధంగా అన్ని గ్రామాల్లోని రైతులు చేసుకోవాలని తెలిపారు.

## ఆలపాటి రాజాను లక్ష మెజారిటీతో గెలిపించుకుందాం.....

**రాష్ట్ర తెదేపా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా**





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణ గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థి అయిన ఆలపాటి రాజా ని గెలిపించాలని కోరుతూ పశ్చిమ నియోజకవర్గంలోని 53 54 55 56 49 46 47 డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశం సోమవారం మొహమ్మద్ ఫతావుల్లా కార్యాలయం ఖిద్మత్ ఘర్ లో నిర్వహించారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతాఉల్లాహ్ మాట్లాడుతూ సకల జనుల శ్రేయస్సే ఎన్డీఏ కూటమి ధ్యేయమని ఆలపాటి రాజాని మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకునే విధంగా గట్టిగా పని చేయాలని ఒక్కొక్క గ్రాడ్యుయేట్ వోటర్ని ఇంటికి పది సార్లు కలిసి ఓటు అభ్యర్థించే విధంగా నియోజకవర్గంలో మంచి మెజార్టీ వచ్చే విధంగా నాయకులందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.మన పార్లమెంట్ సభ్యులు కేసినేని చిన్ని తెలుగుదేశం పార్టీ బిజెపి జనసేన పార్టీల ప్రతి కార్యకర్త ను ఇందులో ఇన్వాల్వ్ చేయాలని సూచించారని తెలియజేశారు.రాష్ట్రం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్న పరిస్థితులు మీరు చూశారని నిరుద్యోగసమస్య పరిష్కారం కావాలంటే, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే కూటమి అభ్యర్థిని ఆలపాటి రాజా ని కచ్చితంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మన ఓటర్ల కు తెలియజేయాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు .బ్యాలెట్ పేపర్ పై ఆలపాటి రాజా పేరు ఎదురుగా ఉన్న ఖాళీ గడిలో 1 (ఒకటి) అంకె మాత్రమే రాయావలన్నారు.నాగుల్ మీరా,బుద్ధ వెంకన్న జలీల్ ఖాన్ , సహకారంతో సూచనలతో ముందుకు వెళదామని మొహమ్మద్ ఫతావుల్లాహ్ అన్నారుఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు క్లస్టర్ ఇన్చార్జీలు అయిన ధనికుల సుబ్బారావు, గణప రాము, లోకేష్ , కరిముల్ల,దివిటి ప్రభు దాస్, నాగోతి రామారావు,షేక్ తాజుద్దీన్, షేక్ జాహిద్, బడుగు వెంకన్న, ఈశ్వర్ ,మధు, మాధవ, అన్సర్, ఇమ్రాన్, అలీ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ హాండ్ బాల్ పోటీలకు కేబీఎన్ విద్యార్థినులు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తమిళనాడు, సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో త్వరలో జరుగబోయే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థినుల బృందం కృష్ణ యూనివర్సిటీ తరఫున ఎంపికైందని కే బీ ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన క్రిష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలలో తమ కళాశాల జట్టు విశేష ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ జట్టులో పాల్గొన్న తమ విద్యార్థినులు బి. లోకేశ్వరి, వి. సుప్రియ, సిహెచ్. ద్వారకేశ్వరి, టి. అరుణ నాగదుర్గ, బి. సత్య, జి. మానస, ఎస్.కె నాగూర్ బి సోత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడా కారులను కళాశాల సెక్రటరీ డాక్టర్ టి. శ్రీనివాసు, హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు అభినందించినట్లు పేర్కొన్నారు.

## పామూరు సర్కిల్ పరిధిలోని ప్రజలకు సీఐ కీలక సూచనలు



**కనిగిరి ఫిబ్రవరి 10 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో గత కొంతకాలంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం సీఐ ఎం భీమానాయక్ మాట్లాడుతూ ఎక్కువ శాతం ప్రమాదాలు హెల్మెట్ లేకపోవడం వలన జరుగుతున్నాయని అన్నారు. అలాగే ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించడం వలన వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. అలాగే పశు వులను రోడ్లపైకి వదలకుండ ఉండాలని, ఇటీవల కొన్ని ప్రమాదాలు పశువులను రోడ్లపైకి వదలడం వలన జరుగుతున్నాయని పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటించడం వలన ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుందని పశువుల యజమానులకు సూచించారు.

# ఉరుకులు పరుగుల విధులకు క్రీడలు వల్లే శారీరక,మానసిక వూరట

● 1991 బ్యాచ్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో బ్యాట్మెంటన్ టోర్నమెంట్
● కార్యక్రమాన్ని ప్రారంభించిన నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ మధ్యకాలంలో అత్యధికంగా జరుగుతున్న సైబర్ నేరాలను నియంత్రణ కోసం పోలీసులది ఉరుకులు పరుగుల జీవితం అయ్యింది. ప్రజలకు అవగాహన ద్వారానే ఈ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడతారని నగర పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర బాబు ఐపీఎస్ వినూత్నంగా నగరంలో సైబర్ సేఫ్టీ పై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ ఆలోచనలను పునికి పుచ్చుకున్న 1991 బ్యాచ్ కి చెందిన పోలీస్ అధికారులు అందరూ కలిసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం నందు ఎన్టీఆర్ మరియు కృష్ణ జిల్లాలకు చెందిన క్రీడాకారులతో బ్యాట్మెంటన్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర బాబు ఐపీఎస్ పాల్గొని బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ను ప్రారంభించినారు. ఈ నేపథ్యంలో సరదాగా కాసేపు బ్యాట్మెంటన్ ఆడారు. ఈ టోర్నమెంట్ కు కృష్ణ ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 84 జంటలు వివిధ విభాగాల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా 11,111/- రూపాయలు, రెండవ బహుమతిగా 7,777/- రూపాయలు, మూడవ బహుమతిగా 4,444/- మరియు నాలుగో బహుమతిగా 2,222/- అందించడం జరుగుతుంది. అనంతరం నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర బాబు ఐపిఎస్ మాట్లాడుతూ..... ఈ 1991 బ్యాచ్ కి చెందిన పోలీస్ అధికారులు చాలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 34 సంవత్సరాలు తర్వాత కూడా వీరికి ట్రైనింగ్ ఇచ్చిన అధికారి జయంతి రావు మరణించిన సమయంలో వారి కుటుంబానికి అండగా ఉంటూ వారిని స్మరించుకుంటూ అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా 34 సంవత్సరాలు సర్వీసులో ఆరోగ్యపరంగా పోలీస్ సిబ్బంది పడుతున్న బాధలను గమనించి పోలీస్ పోలీస్ కుటుంబాలకు ఆరోగ్యపరంగా ఏదైనా చేయాలని ఉద్దేశంతో నగరంలోని వివిధ హాస్పిటల్స్ వారితో మాట్లాడి పోలీస్ సిబ్బందికి హెల్త్ కార్డులు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసినారు అదే విధంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సదుద్దేశంతో ఈ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రజల్లో పోలీసులపై మరింత గౌరవం పెరిగి ఫ్రెండ్లీ పోలీసింగ్ కి విలువ తీసుకొస్తున్నారని తెలియజేశారు. ఈ విధంగా ముందు కూడా ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర బాబు తో పాటు ఎ. డి. సి. పి. ప్రసన్న కుమార్, 1991 బ్యాచ్ పోలీస్ అధికారులు పివి మారుతీ రావు , దామోదర్ రావు , రవికాంత్ , సుభాకర్ , సత్యానందం , వంశీధర్ గౌడ్ , ధర్మేంద్ర , రాజీవ్ కుమార్ , పి.భాస్కర రావు , రఘురాం మోహన్ , విజయ భాస్కర్ , వర్మ , కిషోర్ , డి ప్రసాద రావు , ఆర్. ఐ. లు శ్రీనివాసరావు, రాజ శేఖర్, రవి తేజ , క్రీడాకారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**సంగం, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారులు శ్రీనివాసులు రెడ్డి, అశోక్ కుమార్ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిఎం , హెచ్ ఓ ఖాదర్ వలీ, ఎంపీడీఓ షాలెట్ లు పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణ దినోత్సవం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి. విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు తప్పనిసరిగా ఈ మందులను వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమతి పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల విలీనంపై తల్లిదండ్రుల ఆందోళన



**సంగం, ఫిబ్రవరి 10 (వార్తాప్రభ):** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా సంగం లోని ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను వేరే పాఠశాలకు తరలించటం పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహించారు. తరలించొద్దు,తరలించొద్దు మా పాఠశాలను తరలించొద్దు అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మా పాఠశాలలో 34 మంది విద్యార్థుల ను వేరే పాఠశాలకు విలీనం చేయడం సరికాదని మండిపడ్డారు. మా పాఠశాలలో 1 నుండి 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.1 నుండి 5 తరగతులు కొనసాగించాలని పాఠశాల విద్యా కమిటీ తీర్మానం చేసింది. అనంతరం పాఠశాల హెడ్ మాస్టర్, ఎంఈఓ, ఎంపీడీఓ లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో విద్యా కమిటీ చైర్మన్ పావని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చటంలో కూటమి సర్కారు విఫలం

**వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు**

**వైసీపీ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్ లను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్**





డివిజన్ పరిధి వై.వి.ఎస్టేట్ లో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చటంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. అదే గత వైసీపీ ప్రభుత్వంలో చిట్టచివరి గృహం వరకు కృష్ణా జలాలు అందించటమే లక్ష్యంగా విశేషంగా కృషి చేయటం జరిగిందన్నారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన 8 నెలలకాలంలో నియోజకవర్గంలో కొత్తగా ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టకపోగా.. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను సైతం కక్షపూరితంగా నిలిపివేయటం బాధాకరమన్నారు. దీంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. 58వ డివిజన్ పరిధి వై.వి.ఎస్టేట్ లో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులే ఇందుకు నిదర్శనమని మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల మేరకు వై.వి.ఎస్టేట్ నుంచి ఇందిరానాయక్ నగర్ వరకు పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకోగా.. ఫిబ్రవరి 9, 2023న భూమిపూజ చేసుకున్నట్లు గుర్తుచేశారు. రూ. 4.16 కోట్లతో(రూ. 3.30 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు., రూ. 86.49 లక్షల వీఎంసీ సాధారణ నిధులు) 1,500 కిలో లీటర్ల రిజర్వాయర్ నిర్మాణానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక ప్రజలతో కలిసి ఆనాడు శంకుస్థాపన చేసుకోగా పనులు చివరి దశలో ఉన్నట్లు చెప్పారు. అలాగే రూ.3.61 కోట్ల 15 వ ఆర్థిక సంఘం నిధులతో నీటి సరఫరా పంపింగ్ మెయిన్ లైన్ పనులు కూడా అప్పటికే పూర్తి చేసుకోగా.. శివారు ప్రాంతాలలోని చివరి ఇంటి వరకు దాదాపు 20 వేల కుటుంబాలకు త్రాగునీరు అందించటమే లక్ష్యంగా ముందుకు వెళ్ళటం జరిగిందని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందేమోనన్న దుగ్ధతో పనులు నిలిపివేసిందని మండిపడ్డారు. రానున్నది వేసవి కాలం కావడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అక్కడి ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి గడప గడపకు త్రాగునీరు అందేదని తెలియజేశారు.

**ప్రజావసరాలను గుర్తించడంలో విఫలం** ప్రజావసరాలను గుర్తించడంలో కూటమి సర్కారు తొలి నుంచి విఫలమవుతూనే ఉందని మల్లాది విష్ణు దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో దావు బుచ్చయ్య కాలనీలో రూ. 3.30 కోట్ల అంచనాలతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించడంతో పాటు గంగిరెద్దుల దిబ్బ నుంచి జీవీఆర్ నగర్ వాటర్ ట్యాంక్ వరకు రూ. 3.29 కోట్ల వ్యయంతో 400 ఎమ్ ఎమ్ మంచి నీటి సరఫరా పంపింగ్ మెయిన్ పనులు పూర్తి చేసుకున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా.. ఓవర్ హెడ్ ట్యాంక్ ని వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వీఎంసీ చేస్తున్న తాత్సారం కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. మరోవైపు ఈ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి గాను సంపు నిర్మాణం చేపట్టి పూర్తిచేసినప్పటికి.. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో పూర్తిస్థాయిలో కనెక్షన్లు ఇవ్వలేకపోయామన్నారు. కనుక ప్రభుత్వపెద్దలు రైల్వే డిఆర్ఎంతో మాట్లాడి రామకృష్ణాపురం రైల్వే వంతెన కిందుగా యూజిలైన్లు వేసి ఇంటింటికీ కనెక్షన్ ఇచ్చే దిశగా కృషి చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, వీఎంసీ మొద్దునిద్ర వీడి గత ప్రభుత్వంలో పూర్తి చేసుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్ లను వినియోగంలోకి తీసుకురావాలని.. లేనిపక్షంలో ప్రజల తరపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

## విద్యా సామాజిక సేవా రంగాలలో కీలక పాత్ర పోషిస్తున్న డెమొక్రటిక్ పి ఆర్ టి యు........

**ఏ.పీ,జె.ఎ.సి, చైర్మన్ కె.వి. శివారెడ్డి....**



**విజయవాడ కృష్ణలంక ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో డెమొక్రటిక్ పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం కృషి చేస్తూ మరో ప్రక్క ఉపాధ్యాయ సేవాదళ్ పేరు తో ఎన్నో విద్యా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ రక్త దాన శిబిరాలు పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఉచిత స్టడీ మెటీరియల్ వంటి విద్యా సామాజిక సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ రాష్ట్రం లో విద్యా సామాజిక సేవా రంగాల్లో కీలక పాత్ర పోషించటం అభినందనీయమని ఏ.పీ జె.ఎ.సి చైర్మన్.ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు.కె.వి శివారెడ్డి అన్నారు.డెమొక్రటిక్ పిఆర్టియు మాతృ సంఘం పి.ఆర్.టి.యు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (రిజిస్టర్ నెంబర్ 67 /73) 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి గా విచ్చేసిన కె.వి శివారెడ్డి మాట్లాడుతూ సమాజం లో ఉపాధ్యాయులకు గౌరవాన్ని పెంచడానికి శక్తి వంచన లేకుండా డి.పి.ఆర్.టియు నాయకులు కృషి చేస్తున్నారన్నారు. ఆవిర్భావ దినోత్సవానికి విశిష్ట అతిథి గా విచ్చేసిన ఏపీ జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.విద్యాసాగర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉపాధ్యాయు జీవన ప్రమాణాలను పెంచడానికి వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించడానికి. పి.ఆర్.టి.యు. చారిత్రాత్మకమైన సేవలు అందించింది అన్నారు.విశిష్ట అతిథి విచ్చేసిన ఇంటర్నేషనల్ లయన్ నాయకులు మూల్పూరి ఉపేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయ సమాజానికి గర్వకారణంగా ఉపాధ్యాయ సేవాదళ్ ఎదిగిందని వరుసగా ఐదుసార్లు జిల్లా కలెక్టర్ చే ప్రత్యేక పురస్కారాలు స్వీకరించటం దీనికి నిదర్శనం అన్నారు . సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ డి శ్రీను మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆ యాలకు నూతన వస్త్రాలను చేయడం ప్రతిభవంతులను పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్పు అందజేసే అందజేసే సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. శివారెడ్డి మరియు విద్యాసాగర్ లకు ఘన సన్మానం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా వంద లాది మంది ఉపాధ్యాయుల సమక్షంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి అన్నారు.ఈ కార్యక్రమంలో.రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి. పి. వెంకటేశ్వరరావు,ముఖ్య సలహాదారులు డాక్టర్. ఎం. అచ్యుత రావు,డి పి ఆర్ టి యు నాయకులు జీ.వీఎస్, పెరుమాళ్ళు,నున్న రాంబాబు,డి సత్యనారాయణ, మరి ప్రభాకర్,పి నాగరాజు,. ఈ వెంకట్ రెడ్డి,శిరీష, నాగిని, వివిధ మండలాల నాయకులు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన నాట్య సంబరాలు .



**అవనిగడ్డ: ఫిబ్రవరి 10(వార్తాప్రభ ప్రతినిధి)**శ్రీ అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్దేంద్ర యోగి జయంతి నాట్య మహోత్సవాల సందర్భంగా కళాకారుల నాట్యప్రదర్శనలతో కూచిపూడిలో పండగ వాతావరణం నెలకొంది. కూచిపూడి భాగవతుల జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రారంభమైన కార్యక్రమాల్లో చదలవాడ ఆనంద్ (విజయవాడ) శిష్యురాలునాదపద్మ నారాయణతీర్థుల తరంగం ప్రదర్శించారు. శ్రీ దుర్గా సాయి నిత్యనికేతన్ (కొత్తగూడెం) ప్రిన్సిపాల్ శీతాలక్ష్మిప్రసాద్ పర్యవేక్షణలో ఆర్ మనీషా ఎస్. శ్రీనిజ కూచిపూడి యుగళనర్తనం ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు లక్ష్మీ బాబు (యూఎస్ఏ) శిష్యురాలు నందిపల్లిసాహితి ఆలోకయేశ్రీ బాలకృష్ణ... వ్యస్త నృత్యాంశాన్నిప్రదర్శించారు. శ్రీ నృత్యకళానిలయం (విజయవాడ) నిర్వాహకురాలుగోనుగుంట శైలశ్రీ ఆధ్వర్యంలో జి సత్యానందిని జి రమ్య సాహితి కూచిపూడి చేశారు. శ్రీ లలిత స్కూల్ ఆఫ్ డాన్స్ (హైదరాబాద్) ప్రిన్సిపాల్ డాక్టర్ వై .లలితాసింధూరి తో పాటు శిష్యులురిత్విక, రుత్వి, తన్వి, రితికలుబృందనాట్యాలను ప్రదర్శించి ఆహుతులను మైమరిపింపచేశారు. ప్రవాస భారతీయుల కుటుంబాలు ఆర్థిక సహకారంతో శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం, కూచిపూడి ఆర్ట్ హెరిటేజ్ సొసైటీ ల సహకారంతో రెండు రోజులపాటు కొనసాగిన మహోత్సవాలు లో కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయ శర్మ, పసుమర్తి హరినాథ శాస్త్రి (సోదరులు) కళాకారులను సత్కరించి వందన సమర్పణ చేశారు.కళాపీఠం గ్రంథాలయ పాలకులు ఫణి కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## మండల కేంద్రాలలో సదరన్ క్యాంపులు నిర్వహించాలి

**మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్**



**విస్సన్నపేట ఫిబ్రవరి 10(వార్తాప్రభ ప్రతినిధి)** మానసిక వికలాంగుడు అంధత్వంతో ప్రత్యక్షంగా కనబడుతున్న సదరన్ క్యాంపు వెరిఫికేషన్ కొరకు జిల్లా కేంద్రానికి వెళ్లాలని చెప్పటం దురదృష్టకరం అని తిరువూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రాల సచివాలయాలలో సదరన్ క్యాంపులు నిర్వహించాలని అంగవైకల్యం శాతాన్ని బట్టి పెన్షన్ ఇస్తానన్న హామీని టిడిపి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా కనబడుతున్న అంధత్వానికి కూడా సదరన్ వెరిఫికేషన్ చేయాలని అని చెప్పటం దురదృష్టకరమన్నారు. మండల స్థాయిలో ఉన్న డాక్టర్లు వాస్తవాలను ప్రత్యక్షంగా పరిశీలించి నిర్ణయించగలిగిన విషయాన్ని కూడా మీనమేషాలు లెక్క వేస్తూ జిల్లా కేంద్రానికి వెళ్లాలని చెప్పటం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏ కొండూరు మండలం వైసిపి ఇన్చార్జి నరేడ్ల వీరారెడ్డి పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర**





**కనిగిరి ఫిబ్రవరి 10 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలంలోని అయ్యలూరి వారి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి దేవాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామంలో నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి దేవస్థానం ముఖ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వినాయకుని ధ్వజస్తంభ కార్యక్రమంలో పాల్గొని వేదమంత్రాల నడుమ ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు ముత్యాల వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముత్యాల రమణారెడ్డి మాజీ జెడ్పిటిసి సభ్యులు ముత్యాల వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీ నారాయణరెడ్డి ,గంగిరెడ్డి రామచంద్రారెడ్డి ,గంటా శ్రీరాములు రెడ్డి ,పాలు గుళ్ళ మోహన్ రెడ్డి ,సమ్మన రమణయ్య, జి మోహన్ రెడ్డి మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు, నాగిశెట్టి చినమాల కొండయ్య, బోయళ్ళ నారాయణరెడ్డి ,చెరుకుపల్లి వెంకట రెడ్డి ,మన్నేపల్లి శ్రీనివాసులు అయ్యలూరి వారి పల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లడంలో చనమోలు కీలక పాత్ర

**- కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):-** మైలవరం నియోజకవర్గంలో పాటు రాష్ట్రాభివృద్ధిలో మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు తనదైన ముద్ర వేశారని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు 93వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంతానికి జిల్లాకు, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంలో చనమోలు పాత్ర మరువలేనిదన్నారు. మైలవరం నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రహదారులను అనుసంధానం చేయడంలో, వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, అక్కల ప్రసాద్, చెరుకు ఆనందరావు, పోతురాజు థామస్ పాల్, బాణావత్ హేమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు దంతాలు ఆరోగ్యంగా ఉంచుకోవాలి-డాక్టర్ ఎస్. సురేష్

**నిమ్రా దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో బాలికలకు ఉచిత వైద్య శిబిరం**



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):-**చిన్నవయసులో వివిధ రకాల తినుబండరాలు తినడం వల్ల దంతాలు పాడయ్యే అవకాశం ఉందని కావున ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ దంతాలను ఆరోగ్య ఉంచుకోవాలని తెలిపారు నిమ్రా దంత వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ సురేష్. స్థానిక నిమ్రా దంత వైద్య కళాశాల మరియు నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఉమ్మడిగా కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నాడు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో పాఠశాలలోని విద్యార్థినులకు దంత పరీక్షలు నిర్వహించారు. వివిధ దంత సమస్యలను గుర్తించిన దంత వైద్యులు వారికి తగిన చికిత్సలు సూచించారు. అనంతరం పిల్లల్లో సాధారణంగా ఎదురయ్యే దంతవ్యాధులకు గల కారణాలు, వాటి నివారణపై నిమ్రా దంత వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. సురేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రకాల తిరుబండారాలు తినడం వల్ల దంతాలకు హాని కలిగిస్తాయని, ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలని తెలిపారు.శరీర ఆరోగ్యంతో పాటు దంత ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని విద్యార్థులకు తెలియజేశారు. నిమ్రా దంత కళాశాలలో వివిధ రకాల సమస్యలకు తక్కువ ధరలకు చికిత్స అందిస్తారని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు క్యాంపులో పాల్గొని తమ వంతు సహకారం అందించారు.వైద్య శిబిరానికి సహకరించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని,నిమ్రా దంత వైద్యశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాహిత్యాలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలోదంత వైద్య కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామానంద్, నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు యూనిక్ ఐడి నమోదు చేసుకోండి- ఎంఏఓ ప్రతాప్



**కలువాయి ఫిబ్రవరి 10 (వార్తాప్రభ)** కేంద్ర ప్రభుత్వం దేశం లోని రైతులందరికీ ఒక యూనిక్ ఐడిని ఇవ్వబోతుంద ని కలువాయి మండల వ్యవసాయాధికారి ప్రతాప్ తెలిపారు.ఈ ఐడి ద్వారానే అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ ఇతరత్రా అనగా గవర్నమెంట్ నుండి రైతులు కు అందే ప్రతి స్కీమ్ ఈ ఐడి ఉంటే ఇవ్వటం జరుగుతుంది.కావున ప్రతి రైతు యూనిక్ ఐ డి నీ పొందాలని తెలిపారు.ఈ యూనిక్ ఐడిని రైతు సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని రైతులు మీ పాస్ బుక్ జెరాక్స్ మరియు ఆధార్ జెరాక్స్ తో రైతు సేవా కేంద్రాల నందు మీ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు రైతు తప్పనిసరిగా తమ ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్ తో కూడిన మొబైల్ తీసుకువెళ్ళాలని ఏవైనా సందేహాలు ఉంటే రైతు సేవ కేంద్రంను లేదా విఆర్ఓని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు.

## ఆర్టీసిహౌస్ లో ఆర్టీసీ యం.డి ద్వారకాతిరుమల రావుతో ఏపీ జేఏసీ అమరావతి భేటీ



**విజయవాడ ఫిబ్రవరి 10 (వార్తాప్రభ ప్రతినిధి):** ఆర్టీసిహౌస్ లో ఆర్టీసీ వీసి ,యం.డి ద్వారకాతిరుమల రావు (రిటైర్డ్) ని సోమవారం మర్యాదపూర్వకంగా కలసి, వారు పూర్తి భాద్యతలు చేపట్టిన సందర్భంగా పుష్ప గుచ్ఛంతో వారిని ఏపీ జేఏసీ అమరావతి పక్షాన చైర్మన్ బొప్పరాజు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారితో ఆర్టీసీ ఉద్యోగులు, సెక్యూరిటీ స్టాఫ్ తదితర ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన అనంతరం ఏర్పడిన సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలను వారి దృష్టికి తీసుకుని వెళ్ళగా తప్పకుండా అన్ని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఆర్టీసీ వీసి %డ% యం.డి ని కలిసిన వారిలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిసెట్టి రాజేష్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.శంకర్ రావు, కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులు శేషగిరి రావు, శ్రీనివాసరావు, ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగుల సంఘం పక్షాన మల్లికార్జున, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ.నాగేశ్వర రావు, గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్యా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, సహా అధ్యక్షులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బత్తుల చరణ్య పాప కుటుంబ సభ్యులను పరామర్శించిన వడ్డెర సంఘము నాయకులు

**రాష్ట్ర అధ్యక్షులు వేముల బేబి రాణి**



**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 10(వార్తా ప్రభ ప్రతినిధి):**-ఇబ్రహీంపట్నం చెందిన బత్తుల చరణ్య పాప ను సోమవారం ఉదయం గుంటూరు హాస్పిటల్ లో లివర్ సమస్య తో బాధపడుతున్న బత్తుల చరణ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం డాక్టర్ తో మాట్లాడి చరణ్య ఆరోగ్యం సమస్యను అడిగి తెలుసుకున్నారు .అనంతరం బత్తుల చరణ్య కు మెరుగైన వైద్యం అందించాలి అన్ని కోరడమైనది.చరణ్య కుటుంబానికి వడ్డెర సంఘము అండగా ఉంటుంది అన్ని భరోసానించారు.ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘము అధ్యక్షులు,రాష్ట్ర బీసీ సంఘము అధ్యక్షులు వేముల బేబీ రాణి,బత్తుల నాగేశ్వరావు,చల్ల పుల్లారావు, ఓర్సు ప్రేమిరాజు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై కాల్ చేయండి వెంటనే అందిస్తాం- విద్యుత్ అధికారి ప్రసాద్

**కూకట్ పల్లి,ఫిబ్రవరి10(వార్తప్రభ):**రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని హనుమాన్ నగర్ లో చుట్టు పక్కల కా లనీ వాసు లు, అధ్యక్షు లు తో సమా వే శం ఏర్పా టు చేసి న విద్యుత్ అది . కా ౦ ం ల ౦ .



సోమవారం హనుమాన్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏ.డి.ఈ ప్రసాద్ మాట్లాడుతూ హనుమాన్ నగర్, దినబంధు కాలనీ,ప్రగతి నగర్,రామకృష్ణ నగర్,ఆర్పి కాలనీ,లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై కాలనీ అధ్యక్షులతో చర్చించి కాలనీ లలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ల వద్ద లోడ్ ఇన్ బ్యాలెన్స్ కాకుండా ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ వన్ పేస్ నుండి త్రీఫేస్కు పెంచడం, కొత్త కేబుల్ 11 కేబుల్ లైన్లో కూడా వేయడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు మాట్లాడుతూ కాలనీ ప్రధాన కూడళ్లల వద్ద ఉన్నా ట్రాన్స్ఫార్మర్లు పాతవి ఉన్నవి వాటి స్థానంలో పెద్ద ట్రాన్స్ఫార్మర్లు కొత్తవి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ ఏడిఈ ప్రసాద్, హనుమన్ నగర్ కాలనీ అధ్యక్షులు ఎం.విఠల్,ప్రగతి నగర్ అధ్యక్షులు తిరుపతిరావు, రామకృష్ణ నగర్ అధ్యక్షులు మధు, ఏ.ఈ పిరు నాయక్, లైన్మెన్లు తులసి రావు, ఓబులేష్,బి.విఠల్,బాబు రావు,విరేష్ యాదవ్,ప్రసాద్, విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

